ప్రజాశక్తి
బుధవారం 14 డిసెంబర్ 2022

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారమివ్వాలి

- ఈనెల 15న ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి - సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అకాల వర్షాలు, నకిలీ విత్తనాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఈనెల 15న చేపట్టే ఆర్‌డిఒ కార్యాలయాల ముట్టడిలో అధికసంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో ఈఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు నష్టపోయినంత గతంలో ఎన్నడూ నష్టపోలేదని తెలిపారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్లో రైతులు పత్తి, ఉల్లి, పప్పుశనగ, మిర్చి, వరి, కంది, టమాటా, పొగాకు లాంటి పంటలు వేశారన్నారు. ప్రారంభంలో ఆశాజనకంగా పంటల చూసి ఆనందించిన రైతులకు అకాల వర్షాలు, నకిలీ విత్తన కంపెనీలు చేసిన మోసాలకు జిల్లాలో ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. జిల్లాలో 2 లక్షల 55 వేల హెక్టార్లలో పత్తి వెంటనే చూస్తే 90 శాతం రైతులకు చేతికి పంట రాలేదని అన్నారు. ఒక్కో రైతు పత్తి పండించడానికి ఎకరాకు రూ.40,000 నుంచి రూ.60 వేలు ఖర్చు పెట్టుకున్నారని, రైతుకు వచ్చిన దిగుబడి కేవలం ఎకరాకు ఒక క్వింటాలు మాత్రమేనని ఆయన వివరించారు. 90శాతం రైతులకు నష్టం జరిగితే ఇప్పటిదాకా జిల్లా వ్యవసాయ అధికారులు మండలాలకు వెళ్లి పరిశీలించిన పాపాన పోలేదని, జిల్లాలో రైతుల గోడు వినే నాథుడే కరువయ్యాడని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ జిల్లాలో అధికార వైసిపి పార్టీకి ఎంపీ సీట్లు, ఎమ్మెల్యే సీట్లు అన్ని వారికే కట్టిపెట్టినా తమ నియోజకవర్గాల్లో రైతు ఈతి బాధల గురించి కనీసం పరిశీలించడానికి కూడా వారికి సమయం లేదంటే ఇలాంటి వారు ప్రజాప్రతినిధులుగా ఉండడంవల్ల జిల్లాకు, ప్రజానీకానికి ఎటువంటి ప్రయోజనం లేదని విమర్శించారు. కేవలం పత్తి పంట మాత్రమే కాదు, ఉల్లిగడ్డ వేసిన రైతులకు అధిక వర్షాలు వల్ల వేల ఎకరాల్లో చేతికి పంట రాలేదని, వచ్చిన పంట మార్కెట్ కు తీసుకు వెళ్తే రూ.500క్వింటాలు అమ్ముడు పోతుందని, దానివల్ల రైతు మార్కెట్‌కు తీసుకురాకుండా పొలాల్లోనే వదిలి వేస్తున్నారని అన్నారుమూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కొత్తగా వేసిన పప్పు సెనగ ,చేతికొచ్చిన వరి, కంది పంట మాండూస్ తుఫాను వల్ల సర్వనాశనం అయిందని రైతుల బాధలు వర్ణనాతీతమని ఆయన తెలిపారు. అందుకోసమే సిపిఎం రైతులు పండించిన వరి ధాన్యం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొని ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న విత్తన కంపెనీలను నిషేధించాలని, సీజ్ చేయాలని కోరుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొని వచ్చేందుకు సిపిఎం జిల్లా కమిటీ జిల్లాలో ఉన్న అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ముందు రైతుల్ని సమీకరించి బైఠాయిస్తమని తెలిపారు. తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కబ్జా'దారులు'...

- రోడ్డు కబ్జా..పేదల పట్టాల్లో రోడ్డు - న్యాయం కోసం బాధితుల ఎదురుచూపు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కబ్జాకు కాదేదీ అనర్హం అనేలా కబ్జాదారులు ఇష్టానుసారంగా భూములను కబ్జా చేస్తున్నారు. ఏకంగా వంద అడుగుల రోడ్డును కబ్జా చేసేశారు. దాంతో పేదల పట్టాల్లో రోడ్డు వెళ్తోంది. స్థలం ఉన్నా ఇల్లు కట్టుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి ఎక్కడో గ్రామీణ ప్రాంతంలో కాదు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనిదే. న్యాయం కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు...

కార్మికుల ప్లాట్లలో వెళ్తున్న రోడ్డు. ఇన్‌సెట్‌లో లేఅవుట్

ఎప్పుడూ ఎక్కడో ఒక చోట పేదల భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఏకంగా కర్నూలు నగరంలో ఓ రోడ్డే కబ్జాకు గురైంది. నగరంలోని వాసవి నగర్ లో ఒమేగా ఆస్పత్రి ఎదురుగా ప్రతిభ పాఠశాల మీదుగా నంద్యాల రోడ్డులోకి కలిసేలా వంద అడుగుల రోడ్డు ఉంది. ఆ ప్రాంతంలో 155, 156, 157 సర్వే నెంబర్లలో 2004లో బీడీ కార్మికులకు పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో వంద అడుగుల రోడ్డు కబ్జాకు గురైంది. ఆ ప్రాంతానికి చెందిన ఓ సంఘానికి చెందిన మహిళా నాయకురాలు పలుకుబడి, పెద్దల అండదండలతో ఏకంగా రోడ్డును ఆక్రమించింది. అంతటితో ఆగకుండా బీడీ కార్మికుల స్థలాల్లో మరో రోడ్డును కూడా ఏర్పాటు చేశారు. కబ్జా అయిన ప్రాంతంలోని రోడ్డు ముగ్గురు కార్మికుల స్థలాల్లో వెళ్ళింది. దాంతో వారికి ప్రభుత్వం ఇచ్చిన స్థలం ఉన్నా ఇల్లు కట్టుకునేందుకు వీలు లేకుండా పోయింది. దీనిపై కలెక్టర్‌కు ఒక బాధితుడు అర్జీ ఇవ్వగా సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో సర్వే చేసి రోడ్డు ఉన్నది పట్టా స్థలంలోనే అని తేల్చారు. కానీ ఇల్లు కట్టుకోవాలంటే అసలైన ప్రాంతంలో రోడ్డు సిద్ధం చేయాలని ఆ ప్రాంతంలోని ఒక వైసిపి నాయకుడు అంటున్నారు. దీనికై మున్సిపల్ అధికారులకు చెప్పినా తమకు రోడ్డు సిద్ధం చేయడానికి బడ్జెట్ లేదని అంటున్నారు. ఇలా మొత్తంగా బీడీ కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. రోడ్డు కబ్జా చేసిన మహిళా నాయకురాలు ఆ ప్రాంతంలో ఇంకో చోట కూడా కబ్జా చేసి ఇతరులకు విక్రయించింది. అసలైన భూ యజమానులు కోర్టులో కేసు వేయడంతో స్థలం కొన్న వారు ఆ మహిళా నేతను ప్రశ్నించారు. ఇలా ఆ మహిళ కబ్జాలు కొనసాగుతున్నాయి.

న్యాయం చేయాలి

బీడీ కార్మికుల కోసం ప్రభుత్వం 2004లో స్థలాలు ఇచ్చింది. అందులో మాకు 344 ప్లాటు నంబర్ తో సెంటున్నర స్థలాన్ని కేటాయించారు. మా ప్లాటు ముందర ఉన్న వంద అడుగుల రోడ్డును ఆక్రమించి మా ప్లాటులో దారిని తయారు చేశారు. దాంతో ఇల్లు కట్టుకోలేకపోతున్నాము. అర్బన్ సర్వేయర్ తో సర్వే చేయించాం. దారి చేసిన చోటే మా ప్లాటులో ఉన్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- ఎస్.మునీర్ అహ్మద్, బాధితుడు.

చర్యలు తీసుకుంటాం

రోడ్డు కబ్జా విషయం మా దృష్టికి రాలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం. రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

- ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్.

జూనియర్ లైన్ మెన్ గ్రేడ్-2 సమస్యల పరిష్కారానికి కృషి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్, జూనియర్ లైన్ మెన్ గ్రేడ్-2 సమస్యలను పరిష్కరించి వాటి అమలకు ఆదేశిస్తామని కర్నూలు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎం.ఉమాపతి హామీ ఇచ్చారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్, ఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ, ఉపాధ్యక్షులు, పి.నాగరాజు, ఎనర్జీ అసిస్టెంట్, జూనియర్ లైన మెన్ గ్రేడ్ 2 ఆదోని డివిజన్ కమిటీ, ప్రధాన కార్యదర్శి, కె.నాగన్న తెలిపారు. మంగళవారం ఎస్ఇ ఛాంబర్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ప్రతినిధులతో ఎనర్జీ అసిస్టెంట్ /జూనియర్ లైన్ మెన్ గ్రేడ్ 2 సమస్యల పైన చర్చలు జరిగాయి. ప్రధానంగా ఎనర్జీ అసిస్టెంట్, జూనియర్ లైన్ మెన్ గ్రేడ్ టూ కార్మికులు వారిని నియమించిన గ్రామ సచివాలయంలోనే పనిచేయాలని, మరో సచివాలయంలో పనిచేయడానికి వీలులేదని ఆ విధంగా ఆదేశాలిస్తామన్నారు. దూర ప్రాంతంలో పనిచేస్తున్న జెఎల్ఎం గ్రేడ్2 కార్మికులను వారి సొంత మండలాలకు బదిలీ చేయడానికి ఒప్పుకున్నారన్నారు. రెండు మూడు గ్రామాలకు ఒకే జెఎల్ఎం గ్రేడ్ 2 పనిచేయడానికి వీల్లేదని, జెఎల్ఎం గ్రేడ్ 2 కార్మికులను నియమించిన గ్రామ సచివాలయంలో పనిచేయాలని, అదేవిధంగా జెఎల్ఎం గ్రేడ్ 2 కార్మికులు నాన్ స్లాబ్ రీడింగ్స్, హెచ్‌టి. రీడింగ్స్ తీయడానికి వీల్లేదని వీటిని అసిస్టెంట్ ఇంజనీరు, లైన్ ఇన్‌స్పెక్టర్ మాత్రమే తీయాలన్నారు. 33 కె.వి., 11 కె.వి. లైన్ క్లియర్ తీసుకున్నప్పుడు తప్పనిసరిగా లైన్ ఇన్‌స్పెక్టర్లు లైన్ మెన్లు, ఇంజనీర్లు, తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంత మంది ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొహిబిషన్ పీరియడ్ డిక్లియర్ చేసి రెగ్యులర్ చేయడం జరిగిందని మిగిలిన జేఎల్ఎం గ్రేడ్ 2 కార్మికులను త్వరలోనే ప్రొహిబిషన్ పీరియడ్ డిక్లియర్ చేసి రెగ్యులర్ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ముఖ్యంగా పోల్ టు పోల్ కార్మికులను, 33/11 కెవి. సబ్ స్టేషన్ నందు పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను బదిలీ చేయాలని కోరగా తప్పకుండా బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలన్నీ అమలు చేయడానికి త్వరలో ఆదేశాలిస్తామని కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్, సూపరింటెండెంగ్ ఇంజనీరు, ఎం.ఉమాపతి స్పష్టమైన హామీ ఇచ్చారని వారు తెలిపారు.

విద్యుత్ ఎస్ఇకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత

- బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎక్కువ మందికి ఉపాధి కల్పించే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత నిచ్చి విరివిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లకు సంబంధించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశాలను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం వెనుక బడి ఉందని, ఈ ప్రాంతంలో సాధ్యమైనంత ఎక్కువగా యువత, రైతులకు అధికంగా రుణాలు మంజూరు చేసి అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. ఈ అంశంపై బ్యాంకర్లు సీరియస్‌గా దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వ్యవసాయ రంగంలో 46 శాతం మాత్రమే రుణాలు మంజూరు చేశారన్నారు. 4,5 బ్యాంకులు తప్ప మిగిలిన బ్యాంకులు రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కలిగే అవకాశం ఉందని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే మూడు నెలల్లో కచ్చితమైన కార్యాచరణ రుణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులు ఇబ్బంది పడకుండా ఈ క్రాప్‌లో ఏ పంట నమోదు అయివుంటే ఆ పంటకు రుణాలు మంజూరు చేసేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కౌలు రైతుల రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్ఆర్ చేయూత తదితర పథకాలకు సంబంధించి బ్యాంకు అకౌంట్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కర్నూలు నగర శివారులలో ఇళ్ల మంజూరు అయిన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తోందని, అదనంగా కొంత మొత్తాన్ని సెల్ఫ్ డిక్లరేషన్‌తో రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. లీడ్ బ్యాంగ్ జిల్లా డివిజనల్ మేనేజర్ వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ .7784 కోట్లకు , రూ. 5108 కోట్ల రుణాలు బ్యాంకులు మంజూరు చేశాయని తెలిపారు. ప్రాధాన్యేతర రంగాలకు రూ. 2753 కోట్లకు గాను రూ. 2002 కోట్ల రుణాలు మంజూరు చేశారన్నారు. మొత్తంగా రూ.10537 కోట్లకు గాను రూ.7110 కోట్ల రుణాలు మంజూరు చేశామని బ్యాంకర్లను అభినందిస్తూ, వ్యవసాయ,పారిశ్రామిక రంగాలకు విరివిగా రుణాల మంజూరు లో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. నాబార్డ్ ఎజిఎం భార్గవ, డివిజనల్ మేనేజర్ ఎకె. మహంతి, బ్యాంకర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న కెవి.నారాయణ , ఆంజనేయులు

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

ఆర్ డి ఓ కు వ్యకాసం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో నివాసముంటున్న పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు ఆర్‌డిఒ సి.హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గొందిపర్ల గ్రామ పంచాయతీ పరిధిలో పేపర్ మిల్లు ఉన్నపుడు కంపెనీలో చిప్పర్ హౌస్ సెక్షన్ లో పని చేసే కార్మికులు గొందిపర్ల గ్రామంలో గుడిసెలు వేసుకుని కంపెనీలో పని చేసి జీవించే వారని, కంపెనీ మూత పడిన తర్వాత 30 సంవత్సరాలుగా ఉన్న పేదలు వ్యవసాయేతర పనులు చేస్తూ జీవిస్తున్నారన్నారు. రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, ప్రభుత్వ పథకాలు అన్ని వస్తున్నాయని , వారు నివాసం వుండే గుడిసెలకు మాత్రం పట్టాలు లేన్నారు. వారు నివసించే స్థలాన్ని సర్వే చేసి పేదలకు పట్టాలు ఇవ్వాలని కెవి.నారాయణ ఆర్‌డిఒను కోరారు. ఆర్‌డిఒ స్పందిస్తూ విఆర్‌ఒ సర్వేయర్‌లను పంపి స్థలాన్ని సర్వే చేయించి పేదలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్‌డిఒను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పిబి ఉసేనయ్య ,గొందిపర్ల మాజీ సర్పంచులు జి.ఆంజనేయులు, ఎర్రిదాసు, మాజీ ఉప సర్పంచ్ శ్రీరాములు గ్రామ పేదలు కలిశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : వసతి గృహాలు అన్నింటిలో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లో సంక్షేమ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో పదవ తరగతి చదవుతున్న ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ సబ్జెక్టులలో తక్కువగా మార్కులు వచ్చిన విద్యార్థుల పేర్లతో పాటు ఏ సబ్జెక్టులో తక్కువగా వస్తున్నాయనే దానిపై నివేదిక తయారు చేసి దృష్టి సారించాలన్నారు. అనీమియాపై కూడా ప్రత్యేక దృష్టి సారించి రక్తహీనత తక్కువగా ఉన్న విద్యార్థులకు అవసరమైన పోషకాహారాన్ని అందిస్తున్నామని సంక్షేమ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్‌సి వెల్ఫేర్ అధికారి సూర్య ప్రతాప్ రెడ్డి, బిసి సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బిసి వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు, విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి విజయ, మైనారిటీ సంక్షేమ శాఖ ఇడి మెహబూబ్‌బాష, గిరిజన సంక్షేమ శాఖ ఇడి శ్రీనివాసరావు, ఎఎస్‌డబ్ల్యుఒ తదితరులు పాల్గొన్నారు.

అందరికి సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీస్ ఖాన్ అన్నారు. జొహరాపురం 43 వ సచివాలయం పరిధిలోని జవహరాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం సాయంత్రం పాల్గొన్నారు. హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. వార్డ్ కార్పొరేటర్ పల్లవి, వైసిపి నాయకులు మల్లికార్జున, చిన్న బాబు, అక్బర్ కార్యకర్తలు, అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

మాట్లాడుతున్న ఎఎస్‌పి కృష్ణకాంత్ పాటిల్

మైపర్‌లో ర్యాంగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మదర్ తెరిసా ఫార్మసీ కళాశాల మైఫర్ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఎస్‌పి కృష్ణ కాంత్ పాటిల్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే నష్టాలు , చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. ప్రతి జూనియర్‌ను సోదర సోదరి భావనతో చూడాలన్నారు. ర్యాగింగ్ వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల గురించి అవగాహన లేకపోవడం వల్ల విద్యార్థులు తెలియకుండానే ర్యాగింగ్ చేస్తుంటారని, ర్యాగింగ్‌ను ప్రోత్సహిస్తుంటారని అన్నారు. ర్యాగింగ్‌లో పాలు పంచుకోవడం వల్ల కనీసం ఆరు నెలల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్, కళాశాల ప్రిన్సిపల్ కె. సురేష్ , అకాడమిక్ డీన్ ఎం.రాజకుమార్ , విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలి

మహిళల పట్ల నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
రోడ్డు ప్రమాదాలు నివారించాలి
నేర సమీక్షలో ఎస్‌పి సిద్ధార్థ కౌశల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను వేగంగా పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్‌పి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు , పత్తికొండ , ఆదోని సబ్ డివిజన్ లోని కేసులపై సమీక్షించారు. ప్రతి కేసును రివ్యూ చేశారు. శాంతిభద్రతల గురించి ఆరా తీశారు. ఇయర్ ఎండింగ్‌కు 15 రోజులు మాత్రమే ఉందని గట్టిగా పని చేయాలన్నారు. గత సంవత్సరంతో పోలీస్తే కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించేందుకు గట్టిగా పని చేయాలన్నారు. కేసుల దర్యాప్తులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేసులను పరిష్కరించాలన్నారు. కేసుల్లో నిందితులను స్వల్పవ్యవధిలోనే పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోక్సో కేసులలో నిందితులకు శిక్షింపబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్లలో వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలకు చెందిన పోలీసులు సాంకేతికత వినియోగం, నైపుణ్యతను పెంపొందించుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క పోలీసుకు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో 2 వారాల్లో టెక్నాలజీ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జూనియర్ ఇన్విస్టిగేషన్ అధికారులు దర్యాప్తులలో, వృత్తిలో నైపుణ్యం, సిసిటిఎన్ఎస్ పై అవగాహన శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ-చలనాలు, ప్రాపర్టీ నేరాలలో రీకవరీ చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాలలో ముద్దాయిలను అరెస్టు చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాలు జరగకుండా చూసుకోవాలన్నారు. 174 సిఆర్ పిసి కేసులు, మిస్సింగ్ కేసులు,ఎన్‌డిపిఎస్ కేసులు గ్రేవ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగం నియంత్రణకు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్‌పిలు వెంకటాద్రి, వెంకట్రామయ్య, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, నాగభూషణం, మహేష్, సిఐలు , ఎస్ఐలు పాల్గొన్నారు.



నేరసమీక్షలో మాట్లాడుతున్న ఎస్‌పి, ఇతర అధికారులు

పోలకల్‌లో డిపిఒ పర్యటన

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం పోలకల్‌లో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు మంగళవారం ఆయా ప్రభుత్వ కార్యాల యాలను సందర్శించారు. సచివాలయంను, జిల్లాపరిషత్ స్కూలును, చెత్త సంపద కేంద్రాన్ని, డ్రైనేజిని, వీధి దీపాలను, సిసి రోడ్లను, మిడ్‌డే మీల్స్ ను తనిఖీ చేసి అధికారులంతా అభివృద్ధి పథంలో నడచుకువాలని సూచించారు. గ్రామాల్లో సమస్యల పరిస్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. పది విద్యార్థులతో ముచ్చటించి ఉత్తీర్ణతలో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సందీప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అన్న వడ్డిస్తున్న డిపిఒ నాగరాజునాయుడు

మల్లికార్జున అన్నసత్రానికి రూ. 50 లక్షలు విరాళం

కమిటీ సభ్యులకు చెక్కును అందజేసిన టిజి. వెంకటేష్ , భరత్

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

శ్రీశైల మల్లికార్జున అన్నసత్ర సంఘానికి టిజివి సంస్థలు భారీ విరాళాన్ని ప్రకటించాయి. అన్నసత్ర నిర్మాణానికి రూ. 50 లక్షల చెక్ ను మాజీ ఎంపీ టిజి.వెంకటేష్, టిడిపి కర్నూలు ఇంచార్జ్ టిజి భరత్ మంగళవారం అన్నసత్ర సంఘం సభ్యులకు అందజేశారు. భారీ విరాళం ప్రకటించినందుకు కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనానికి టిజి.లక్ష్మీ వెంకటేష్ భవనంగా పేరు పెడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే సంవత్సరం మార్చి నెలలో ఈ భవనం ప్రారంభమవుతుందన్నారు. వాసవీ సత్ర సమూదాయం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇల్లూరు లక్ష్మయ్య, మల్లికార్జున సత్రం సంఘం అధ్యక్షుడు మిడిదొడ్డి శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి బలుసా శ్రీరాములు, కోశాధికారి సోమిశెట్టి సాయి కిషోర్ పాల్గొన్నారు.

వేదవతిని 8 టిఎంసిలతో నిర్మించాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆర్‌సిసి నిరసన

ఆలూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌సిసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని ఆర్‌సిసి నాయకులు కోరారు. రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆలూరు నుంచి ప్రారంభమైన బైక్ యాత్ర మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. వివిధ గ్రామాల రైతులు, యువకులు ఆర్‌సిసి నాయకులు అర్జున్, సుధాకర్, ప్రకాష్, సిద్ధప్ప ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌సిసి రాష్ట్ర నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజ్ కుమార్ మాట్లాడారు. రాయలసీమకు ముఖద్వారం కర్నూలు అయితే, నదులకు ముఖద్వారం పశ్చిమ ప్రాంతమని తెలిపారు. ఇక్కడ నదులు పారినా తాగడానికి, వ్యవసాయానికి నీళ్లు లేవన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆస్పరి మండలాన్ని ఆయకట్టు మండలంగా గుర్తించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ప్రతాప్, రవివర్మ, రామకృష్ణ, రమేష్, వీరేశ్, నరసింహయ్య, కరీంబాష పాల్గొన్నారు. **ఆలూరులో** బైక్ యాత్రను ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఆర్‌సిసి కమిటీ నాయకులు మసాల ప్రకాష్ మాట్లాడారు. ఈ యాత్ర ఆలూరు నుంచి మొలగవల్లి, ఆస్పరి మీదుగా ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటుందని తెలిపారు. ఆర్‌సిసి నాయకులు అర్జున్, రాజ్‌కుమార్, రామకృష్ణ, వీరేశ్, సందీప్, మహానంది, అక్బర్, మధు, మహేంద్ర పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

అధిక వర్షాలు, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు కోరారు. ఈనెల 15న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కోసిగిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో కురిసిన అధిక వర్షాలు, నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట కోసం తెచ్చిన అప్పు తీర్చే మార్గం కానరాక వలసలు వెళ్తున్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, మండల కమిటీ సభ్యులు వీరేష్, శ్రీనివాసులు, ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్, రామాంజనేయులు, అమీర్, నరసింహులు, వీరారెడ్డి, కురువ ఆదెప్ప, మల్లయ్య, ఈరన్న, రామాంజి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

ప్రజాశక్తి - ఆదోని

రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే కర్నూలు జిల్లా రైతు రక్షణ కాలినడక యాత్రను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని రెడ్డి హాస్టల్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మి రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక వర్షాలు, నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయారని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పత్తి, వేరుశనగ, ఆముదం పంటలకు ఎకరాకు రూ.40 వేలు, మిరప పంటలకు రూ.60 వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. పంటల బీమా పథకాన్ని పూర్తి స్థాయిలో వర్తింపజేయాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలని తెలిపారు. గ్రామాల్లో వలసల నివారణకు ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించి రోజుకు రూ.500 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదోని నుంచి కర్నూలుకు వెళ్లే పాదయాత్రలో రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్, ఆర్‌సిసి నాయకులు ఎసి.శ్రీకాంత్ రెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, జనసేన పార్టీ నాయకులు మల్లప్ప, సిపిఐ ఎంఎల్ నాయకులు మల్లికార్జున, మణెమ్మ, టిడిపి రైతుసంఘం జిల్లా నాయకులు పెద్ద అయ్యన్న, మల్లికార్జున, రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఒ.బి.నాగరాజ్, నియోజకవర్గ అధ్యక్షులు బి.యంకన్న, ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సిపిఐ పట్టణ

అకాల వర్షాలతో అపార నష్టం

- మనోవేదనతో తలడిల్లుతున్న రైతులు
- తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- రంగు మారుతున్న జొన్న కంకి

ప్రజాశక్తి - చిప్పగిరి

మాండూస్ తుపాను కారణంగా గత వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వల్ల పంటలు ఎక్కడ దెబ్బ తింటాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికందే దశలో ఉన్న వరి, పప్పు శనగ, పత్తి, జొన్న, వాము, పొద్దు తిరుగుడు తదితర పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని బంటనహాల్, కాజీపురం, ఏరూరు, చిప్పగిరి తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట నేలవాలి గింజలు నేలపాలవుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన మిరప, పత్తి పంట కూడా చేతికొస్తున్న సమయంలో ఈ వర్షాల వల్ల నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షాల వల్ల నల్లగా మారుతున్న జొన్న కంకి

నేమకల్లు, నగరడోన, రామదుర్గం, బిల్లోన గ్రామాల్లో పప్పు శనగ పంటకు వివిధ రకాల తెగులు సోకుతున్నాయి. ఈ వర్షానికి జొన్న కంకి మీద ఉన్న జొన్నలు కూడా నల్లగా రంగు మారిపోతున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డేగలహాల్, ఏరూరు గ్రామాల్లో మిరప పంట కూడా వర్షం తాకిడికి దెబ్బతింది. రైతులకు ప్రతేడాది ఏదో ఒక రూపంలో నష్టాలే మిగులుతున్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో ఈ అకాల వర్షాలతో ధాన్యం రంగు మారితే ఏ వ్యాపారీ సరైన ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేయరని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలు నష్టపోతున్న రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతుల కోరుతున్నారు.

రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ బీవీ

రైతులను ఆదుకోలేని జగన్ ప్రభుత్వం

- ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలి

- తుపాను దెబ్బకు తడిసిన వరి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

తుపాను వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బనవాసి గ్రామంలో పంట పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాండూస్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ గుర్తించి వైసిపి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బనవాసి బసిరెడ్డి స్వయానా మామ అయిన ఎమ్మెల్యే కేశవరెడ్డి ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేసి రైతులను ఆదుకోకుండా అనవసరంగా వేధిస్తున్నారని తెలిపారు. మామ అధికారం అడ్డు పెట్టుకొని హోమ్ గార్డ్ చెన్నప్పలాంటి అమాయకులను పీడించి, చిత్రహింసలకు గురి చేస్తూ ఆత్మహత్య చేసుకునే విధంగా హింసిస్తున్నారని చెప్పారు. ఇలాంట చర్యలు మాని రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేయాలని హితవు పలికారు. మండల నాయకులు మల్లికార్జున, బనవాసి అయ్యాలప్ప, సోమేశ్వర్ రెడ్డి, శంకరయ్య, ఖాజా, బనవాసి నరసింహులు, అశోక్, అబ్రహాం, సురేష్, నాగరాజు, శంకర్ గౌడ్, రైతులు సోమేష్, తిక్కన్న పాల్గొన్నారు.

బనవాసి కెవికె దగ్గర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి - ఐదు గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలం బనవాసి కెవికె దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అలాగే 5 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి... బనవాసి గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు(18) గొర్రెలను కెవికె దగ్గర బంజర్‌లో బంధించారు. వైసిపి నాయకులు బసిరెడ్డి కెవికె అధికారులకు ఫోన్ ద్వారా ఒత్తిడి చేసి సోమవారం రాత్రి 9 గంటల సమయంలో గొర్రెలను విడిపించారు. వెంకటేశ్వర్లు కెవికె నుంచి హైవే రోడ్డు మార్గం ద్వారా గొర్రెలను బనవాసికి తీసుకెళ్తుండగా టాటా ఏస్ వాహనం ఏడు గొర్రెలను, గొర్రెల కాపరి బోయ వెంకటేశ్వర్లును ఢీకొట్టింది. వెంకటేశ్వర్లును ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మృతుని కుటుంబ సభ్యులకు బీవీ పరామర్శ

మృతి చెందిన గొర్రెల కాపరి బోయ వెంకటేశ్వర్లు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి మంగళవారం పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు, వైసిపి యువ నేత గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణ, రాజన్న, సతీష్, సేకన్న, బాలకృష్ణ మాట్లాడారు. గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. వైసిపి నాయకులు, గుమ్మనూరు అభిమానులు, శ్రేయోభిలాషులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

‘ఒక్క ఛాన్స్’తో నట్టేట ముంచిన జగన్

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో ప్రజలతో మాట్లాడుతున్న బీవీ

‘ఒక్కఛాన్స్’ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధరలను పెంచి రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం నందవరంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయ్ ఆధ్వర్యంలో ‘ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి’ 3వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించకుండా రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి మోహన్ రెడ్డి కలల స్వప్నం శ్రీగురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మించి, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం చేపడితే పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. వాటి నిర్మాణానికి రూ.వేల కోట్ల నిధులు తెస్తే వైసిపి వచ్చిన తర్వాత జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి నిర్మాణాన్ని చేపట్టి ప్రతి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బీవీ ఆదేశాల మేరకు మండలంలోని నదికైరవాడి, ఇబ్రహీంపురం, గంగవరం, జోహరపూరం, పెద్ద కొత్తలి, సజీవపురం, చిన్న కొత్తలి గ్రామాల్లో నాయకులు పర్యటించారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, మండల ఉపాధ్యక్షులు ఖాసీం వలీ, మండల కన్వీనర్ చిన్న రాముడు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ధర్మపురం గోపాల్, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు దావీదు, టిడిపి నాయకులు శంకరమ్మ, బాలరాజు, మస్తాన్, వీరారెడ్డి, బజారి, వీరేష్, రెహ్మాన్, ఆదిశేషు, పరశురాముడు, వడ్డే గోపాల్, నాగప్ప, నరసింహులు, నాగన్న పాల్గొన్నారు. **ఆదోని** 35వ వార్డు అమరావతి నగర్‌లో వార్డు నాయకులు మహ్మద్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్లస్టర్ 10 కోట ఈరన్న, యూనిట్ నెంబర్ 41 అమరావతి నగర్ ఇన్‌ఛార్జీ నూర్జన్, టిజి.వీరేశ్, రవికృష్ణ, నరసింహులు, పింజరి రఫిక్, ఉరుకుందమ్మ, శాంతి, 36వ వార్డు ఇన్‌ఛార్జీ డిష్ హనుమంతు, కాపు నాగేంద్ర, ఆర్.షణ్ముఖ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో టిడిపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కౌతాళం క్లస్టర్ ఇన్‌ఛార్జీ వెంకటపతి రాజు ఆధ్వర్యంలో ‘ఇదేం ఖర్మ’ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాజానందు, కాశీ విశ్వనాథ్, గొట్టయ్య పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

‘జీవ ప్రపంచం’ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గణితోపాధ్యాయులు, ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న ‘జీవ ప్రపంచం’ బాలగేయాల సంకలనాన్ని ఆవిష్కరించారు. మంగళవారం కర్నూలులో కోల్స్ మెమోరియల్ జూనియర్ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్ రెడ్డి, కర్నూలు గ్రంథాలయ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, నిఖిలేష్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షులు మద్దులేటి, మైనారిటీ సంక్షేమ శాఖ అధ్యక్షులు మహబూబ్ బాష, సిసి చర్చి పాస్టర్స్ రెవ అనిల్ కుమార్, జీవన్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం గద్వాల సోమన్నను సన్మానించారు. లైబ్రేరియన్ గోవింద రెడ్డి, ఐటిసి సేల్స్ మేనేజర్ ఆర్‌వి.మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు యువకుల పరామర్శ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

చేతికి శస్త్ర చికిత్స చేసుకొని

హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్న ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డిని పెద్దహరివాణం యువకులు పరామర్శించారు. హైదరాబాదులో నివాసం ఉంటున్న ఎమ్మెల్యేను మంగళవారం గ్రామ యువకులు కుప్పలదొడ్డి బసవరాజ్, వాటర్ షెడ్ కార్యదర్శి బార్కిరాజా, నారాయణ, ఎరుకుల మారేష్, బండి తిమ్మప్ప, డ్రైవర్ గనిసాబ్‌లు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు.

చలానాల దెబ్బకు బెంబేలెత్తిపోతున్న ప్రజలు

- టిడిపి పట్టణ కార్యదర్శి నవాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో పోలీసులు విధిస్తున్న చలానాల దెబ్బకు ప్రజలు గ్రామాల నుంచి పట్టణానికి రావాలంటే భయపడుతున్నారని టిడిపి పట్టణ కార్యదర్శి నవాజ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజల దగ్గర నుంచి ఏ విధంగా డబ్బులు లాగాలో ఆ విధంగా లాగేసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక్కో తాలూకా నుంచి రూ.లక్ష లక్ష్యంగా పెట్టి ప్రజల సొమ్మును పోలీసుల ద్వారా దోచుకుంటున్నారని తెలిపారు. పోలీసులు కూడా లక్ష్యాన్ని సాధించేందుకు ఏం చేయాలో తోచక రాత్రి 9 గంటల వరకు కూడా చలానాలు విధిస్తున్నారని చెప్పారు. ఈ దెబ్బకు పట్టణ, గ్రామీణ ప్రజలు వాహనాలను ఇంటి నుంచి బయటికి తీయాలంటే ఆలోచిస్తున్నారని తెలిపారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం

- ఎంపిపి లక్ష్మిదేవి

ప్రజాశక్తి -దేవనకొండ

గ్రామాల్లో అభివృద్ధి పనులను గుర్తించి సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపిపి లక్ష్మిదేవి, ఎంపిడిఒ గౌరీదేవి కోరారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఇఒఆర్‌డి సూర్యనారాయణ అధ్యక్షతన అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులను గుర్తించి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **హాలహర్వి** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై మూడో రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపిడిఒ ఆంథోని మాట్లాడుతూ... ఆయా గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి అవసరమైన నిధులను సమకూర్చుకోవాలని తెలిపారు. ఇఒఆర్‌డి మల్లికార్జున పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక అవసరం

- ఎంపిడిఒ దాసు నాయక్

ప్రజాశక్తి - హొళగుంద

గ్రామాభివృద్ధికి ప్రణాళిక అవసరమని ఎంపిడిఒ దాసు నాయక్ తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ దాసు నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి నూర్జహాన్‌బీ హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి శేషన్న గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ప్రణాళికల ద్వారా ఆర్థిక, సామాజిక, పర్యావరణ, ప్రజా సేవలు, స్వయం సమృద్ధి, సుస్థిర అభివృద్ధి ద్వారా గ్రామాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. ఆర్డిప్ సంస్థ నాగరాజు మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి ప్రణాళికలు, వాటి అమలు బొమ్మల రూపంలో వివరించారు. వైసిపి నాయకులు శేషప్ప, ఈసా, కుమారస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున పాల్గొన్నారు.

హొళగుందలో మాట్లాడుతున్న అధికారులు

సమస్యల్లో పిహెచ్‌సిలు...

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- సమయపాలన పాటించని వైద్యులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పిహెచ్‌సిలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సిబ్బంది కొరత, సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న వైద్యులు కూడా సమయపాలన పాటించకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పాలకులు చెబుతున్నా అది ఆచరణకు నోచుకోవడం లేదు. ఏదేమైనా పేదోడికి వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది.

ఆదోని మండలం పెద్దహరివాణం, పెద్ద తుంబలం పిహెచ్‌సి కేంద్రాలకు నిత్యం 100 నుంచి 180 మంది దాకా రోగులు వస్తుంటారు. వారికి ఇద్దరు రెగ్యులర్ వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. వీరు సమయపాలన పాటించడం లేదని రోగులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వచ్చిన కూలి డబ్బులు తిండి, పిల్లల చదువులకే సరిపోతున్నాయి. కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి లేదు. పిహెచ్‌సికి వెళ్తే అక్కడ వైద్యులు ఉండరు. సమయపాలన లేకుండా వైద్యులు ఇష్టానుసారంగా వచ్చి వెళ్తుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. స్కానింగ్ విభాగానికి సంబంధించిన అధికారి, సిబ్బంది లేకపోవడంతో ప్రతి బుధవారం ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చే గర్భిణులు మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూడాల్సి వస్తోంది. వైద్యులు లేని సమయంలో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతోందని రోగులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యుల్లో ఒక్కరు కూడా సరైన సమయానికి ఉండడం లేదు. పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. రోగులు అధికమైన సమయాల్లో సిబ్బంది సరిపోక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తామని నాయకులు గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించి, పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దహరివాణం పిహెచ్‌సి

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ల్యాండ్ రికార్డ్స్‌ను పకడ్బందీగా చేపట్టండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఫీల్డ్-ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఢణాపురం, నాగనాథహళ్లి గ్రామాల్లో ఫీల్డ్-ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పనులను సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా రైతులందరికీ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఎలాంటి తప్పులూ జరగకుండా ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లి సమన్వయంతో చేపట్టాలని సూచించారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ కౌసర్ భాను, మండల సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

శాంతి కోరుకునేది భారతదేశం ఒక్కటే

- ప్రముఖ మోటివేషన్ స్పీకర్ జరంగ్ విజయ్

ప్రజాశక్తి - ఆదోని

అగ్రదేశాలు, పేద దేశాలు అనే తేడా లేకుండా వసుధైక కుటుంబంగా భారత దేశం ప్రపంచంలో శాంతిని కోరుకుంటోందని ప్రముఖ మోటివేషన్ స్పీకర్ జరంగ్ విజయ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని విశ్వ నారాయణ జూనియర్ కళాశాలలో అక్షయ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు నాగరాజు అధ్యక్షతన జి-20 సదస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరంగ్ విజయ్ మాట్లాడారు. జి-20 సమావేశాలు భారతదేశంలో జరగడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు. దేశంలోని 56 నగరాల్లో, పట్టణాల్లో వివిధ అంశాలకు సంబంధించి 200 సదస్సులు నిర్వహించబోతున్నారని చెప్పారు. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న మేధావులంతా పాలుపంచుకుంటారని తెలిపారు. ప్రిన్సిపల్ మల్లికార్జున, వెంకటేష్ బాబు, రఘు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య... విజయానికి నాంది

- అష్టావధాని ఆముదాల మురళీ

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విజయానికి నాంది పలుకుతుందని అష్టావధాని ఆముదాల మురళీ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో అష్టావధానం నిర్వహించారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, సెక్రటరీ మైనుద్దీన్ అధ్యక్షత వహించారు. ముందుగా డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ప్రముఖులు మారుతి మోహన్ జ్యోతి ప్రజలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతృ భాష, సాహిత్యం, సంస్కృతిని ఎప్పుడూ మరువరాదని తెలిపారు. వాటి విలువలను క్లుప్తంగా వివరించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్నప్పుడు చక్కగా విని, వాటిని అర్థం చేసుకున్నప్పుడే మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించగలరని తెలిపారు. ఆధునిక కవి సవప్ప గారి ఈరన్న, రాజానందు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శిరీష, ఈరన్న, భీమేష్, విరుపాక్షి, పరమేష్ పాల్గొన్నారు.

అవధానం నిర్వహిస్తున్న మురళీ

భవానీ మాతకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని గుమ్మనూరు గ్రామంలో మంగళవారం భవాని మాల ధరించిన వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో భవానీ మాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని భవానీ మాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భవానీ మాతను అలంకరింపజేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భవానీ మాతకు మహిళలు కాయ, కర్పూరం సమర్పించారు. బుధవారం నిర్వహించే ఇరుముడి కార్యక్రమానికి మండలంలోని మంత్రి గుమ్మనూరు జయరామ్ అభిమానులంతా తరలిరావాలని గుమ్మనూరు నారాయణ కోరారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాల మంజూరుకు కృషి

- వైసిపి రాష్ట్ర నాయకులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు

నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరుకు కృషి చేస్తానని వైసిపి రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక దుర్గారమణ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీతారామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహాయంతో 28 మంది స్థానిక విలేకరులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన వారికి కూడా ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

నేటి ప్రభుత్వంలో పాత్రికేయులకు గౌరవం లేదు

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి

వైసిపి పాలనలో పాత్రికేయులకు గౌరవం లేదని, అవినీతి పనులను వెలికితీసే పాత్రికేయులపై దాడులు జరుగుతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఐకమత్యంగా ఉండాలని తెలిపారు. టిడిపి ప్రభుత్వం వస్తుందని, జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

జర్నలిస్టు సంక్షేమ నిధికి పీఠాధిపతుల విరాళం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. జర్నలిస్టుగా పని చేసిన తనకు జర్నలిస్టుల సమస్యలు తెలుసని పేర్కొన్నారు. శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, శివకుమార్, వీరారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి అమర్‌నాథ్ రెడ్డి, ఐజెయు నాయకులు కొండప్ప, నాగరాజు, జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్, శ్రీనివాసులు, సుంకన్న, రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షులు పరశురాము, ప్రధాన కార్యదర్శి జయరాజు, కోశాధికారి సాబువలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ హుస్సేని పాల్గొన్నారు.

KURNOOL MUNICIPAL CORPORATION

e-Procurement Notice

Tender Notice No.54-1 to 54-5 & 54-7 to 54-18/General Funds/EE&SE/Knl/22-23, dt.06-12-2022 & Tender Notice No.54-6/General Funds/EE&SE/Knl/22-23, dt.06-12-2022 (Short Tender Notice) and Tender Notice No.15-1/15th Finance Commission Grant/EE&SE/Knl/22-23, dt.06-12-2022

Name of the Scheme	General Funds/15th Finance	General Funds
No of works	17/01	01
Bid document download starting date	15/12/2022 at 5:30 P.M	14/12/2022 at 5:30 P.M
Bid document download end date	02/01/2023 at 5:30 P.M	17/12/2023 at 5:30 P.M
Last Date & Time for receipt of Bids	02/01/2023 at 5:30 P.M	17/12/2023 at 5:30 P.M
Commercial Bid Opening Date	02/01/2023 at 5:30 P.M	17/12/2023 at 5:30 P.M

Further details can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. For Contact 9849908497, 8008403996.

Sd/-A.Bhargav Teja, I.A.S.,
Commissioner,
Kurnool Municipal Corporation,
Kurnool.

సమావేశంలో మాట్లాడుతున్న కెవి.నారాయణ

15న ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ

నకిలీ విత్తనాలు, అకాల వర్షాలు వల్ల నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.60 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.... సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ అన్నారు. అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ 60 వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఈశ్వర్ రెడ్డి భవన్‌లో పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పార్టీ మండల కార్యదర్శిల సమావేశం ఆపార్టీ నాయకులు బి.వీర శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. కెవి.నారాయణ మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో అతివృష్టి వలన చాలా నష్టం జరిగిందని, వేల ఎకరాల్లో వేసుకున్న పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల వలన దెబ్బతిన్నాయని, దీని వలన పంటలు బాగా దెబ్బతిని రైతాంగానికి తీవ్రంగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా పత్తి నకిలీ విత్తనాల వలన వేల మంది రైతులు మోసపోయారని, నకిలీ విత్తనాల మాఫియా పట్ల ప్రభుత్వం ఉదాశినత వైఖరితో ఉందన్నారు. నకిలీ విత్తనాలు మాఫీయాను అడ్డుకోవాలని నకిలీ విత్తనాలు అమ్ముతున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం ఉంటుందని, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆస్పరి మండల కార్యదర్శి హనుమంతు పత్తికొండ మండల కార్యదర్శి రంగారెడ్డి, తుగ్గలి మండల కార్యదర్శి పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేపట్టిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి ఆ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధ్యక్షతన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలో శిశు గృహంలో ఉన్న చిన్నారులు మరియు అనాథ పిల్లల సంరక్షణ నిమిత్తం గహంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్, ఆయా, చౌకిదార్ పోస్టులతో పాటు ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ప్రక్రియ లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కెఎల్‌ఆర్‌రె. కుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, సిడబ్ల్యుసి మెంబర్ వెంకట రమణయ్య పాల్గొన్నారు.

18 న కర్నూలు జిల్లా శాప్ యోగాసన లీగ్ పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ఈ నెల 18న కర్నూలు జిల్లా స్థాయి శాప్ యోగాసన లీగ్ పోటీలను ఔట్ డోర్ స్టేడియంలోని యోగ హాల్ నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా శాఖ సిఇఒ పివి రమణ మంగళవారం తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్ (Jaganna Sports Club App)లో క్లబ్బును రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులను మాత్రమే పోటీలకు అనుమతి ఉంటుందన్నారు. 8-12, 12-14, 14-17, 17-21బాల బాలికల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. శాప్ లీగ్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రూ.100 ప్రవేశ రుస్తుము చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కర్నూలు జిల్లా శాప్ యోగ లీగ్ కోఆర్డినేటర్ అవినాష్ శెట్టి (9247400100), స్టేడియంలోని యోగా కోచ్‌లు సత్యనారాయణ, శ్రీనివాస కళ్యాణ్‌లను సంప్రదించాలన్నారు.

జాతీయ వాలీబాల్ కు కవిత ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ఈనెల 16 నుండి 22 వరకు మధ్యప్రదేశ్ లోని పన్నాలో. నిర్వహించనున్న 25వ జాతుయ యూత్ వాలీ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల లో కవిత పాల్గొంటారని జిల్లా కార్యదర్శి షరీఫ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మన కర్నూలు జిల్లా క్రీడాకారిని ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కర్నూల్ జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆయన కోరారు. కవిత బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. యూత్ నేషనల్ ఛాంపియన్షిప్ కవిత ఎంపిక కావడం పట్ల సీనియర్ క్రీడాకారుడు జాఫర్, మున్న, అసోసియేషన్ సభ్యులు పలువురు క్రీడాకారులు క్రీడా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జి పుల్లయ్య కళాశాల ప్రొఫెసర్ కు పిహెచ్‌డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శివలింగేరి డిపార్టుమెంటులో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ అఫ్జల్‌బాష జెఎన్‌టియు నుండి పిహెచ్‌డి పట్టా పొందారు. హాయ్ స్ట్రెంత్ కాంక్రీట్ అనే అంశంపై పరిశోధన చేయడంతో అనంతపురం చెందిన జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఆయనకు పిహెచ్‌డి పట్టా అందజేసింది. ఈ సందర్భంగా ఆయనను విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్యతో పాటు కళాశాల చైర్మన్ జివిఎం మోహన్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ పాండురంగయ్య, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అభినందించారు.

బిఇడి విద్యార్థికి ఆర్‌యు వి సి ప్రశంస

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఒరిస్సా రాష్ట్రంలోని ఆర్‌ఐ భువనేశ్వర్‌లో ఈనెల 21, 22 తేదీల్లో జరిగే 11 వజాతీయస్థాయి మ్యాథమెటిక్స్ సదస్సుకు ఎంపికైన కర్నూలు ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థి కె విష్ణు ను రాయలసీమ వైస్ ఛాన్సర్ ఏ ఆనందరావు ప్రశంసించారు. మ్యాథమెటిక్స్ లో జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సులో రాష్ట్రం నుండి ఎంపికైన ఏకైక విద్యార్థి కె. విష్ణు కావడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. మరిన్ని జాతీయస్థాయి సదస్సులో పాల్గొని విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థికి కళాశాల ప్రిన్సిపల్ రాఘవరెడ్డి , ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వసుంధరలు కూడా అభినందనలు తెలిపారు. విసిని కలిసిన వారిలో విద్యార్థితోపాటు ఐఎఎస్‌ఇ కళాశాల అధ్యాపకులు వి .సురేష్, కె,సురేష్ కుమార్ కూడా ఉన్నారు.

జాతీయ నెట్ బాల్‌కు కెజిబివి పంచలింగాల విద్యార్థులు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ఈ నెల 15నుంచి 18 వరకు హర్యానా రాష్ట్రం భవానిలో జరగబోయే నెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు కెజిబివి పంచలింగాల స్కూల్ విద్యార్థిని బి దయామని, ఎం.లత ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న కుమారి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు గీతాంజలి తెలిపారు.

పాత నగరం చెత్త, బురదమయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాతనగరంలో చెత్తకుప్పను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఓల్డ్ సిటీ మొత్తం కాలువలు నిండి పొంగి పొరలి పాతనగరం చెత్త, బురద మయం అయిందని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముహమ్మద్ షరీఫ్, నగర. నాయకులు ఇంతియాజ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల ఎక్కడి చెత్త అక్కడ పొంగిపొర్లి రోడ్డు మొత్తం బురద మాయమైందని విమర్శించారు. టెలికాన్ఫరెన్స్ పెట్టి మరి చెత్త పన్ను వసూలు చేయమని చెప్తున్న కమిషనర్ నగర స్వచ్ఛత గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని వారు దుయ్యబట్టారు. చెత్త పన్ను వసూలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఒకవైపు చెప్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ గత నాలుగు రోజులుగా వర్షాలు కురిసి ఓల్డ్ సిటీ ఎంత బురద చెత్తతో ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యం కంటే నిధుల సమీకరణనే ధ్యేయంగా నగరపాలక సంస్థ పెట్టుకున్నట్టు కనబడుతుందన్నారు. మించిన్ బజార్లో రెండు చోట్ల చెత్త కుప్పలు కనపడటం లేదా అని అలీషేర్ భాగ్‌లో, బండి మెట్టలో, ఖల్లాలో ఏ వీధిలో చూసినా చెత్తనే తప్ప శుభ్రత స్వచ్ఛతఎక్కడ లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఎక్కడికక్కడ చెత్త చెదారాన్ని తొలగించి, కాలువలు శుభ్రంగా పారేటట్లు చూడాలన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడవద్దని, దోమలు, మలేరియా, డెంగ్యూ, తదితర రోగాల నుండి ప్రజలను కాపాడాలని, వారు హితవు పలికారు. నగరపాలక సిబ్బంది స్పందించి ఓల్డ్ సిటీని పరిశుభ్రంగా ఉంచాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనీమియా పై ప్రత్యేక శ్రద్ధ సారించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా ప్రత్యేక దృష్టి సారిస్తూ ఎస్‌డిజి లక్ష్యాల్లో భాగంగా అనీమియాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు వైద్య అధికారులను ఆదేశించార మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వైద్య శాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌తో వైద్య అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనీమియాను నివృత్తి చేసేందుకుగాను పెద్ద ఎత్తున స్కూల్స్, పాఠశాలల్లో క్యాంప్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎవరైనా రక్త దానం కేంద్రాలు ఏర్పాటు చేసినప్పుడు ఖచ్చితంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ రామగిడ్డయ్యను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రక్త కేంద్రాలలో 10 యూనిట్లు కలెక్ట్ చేస్తే ప్రభుత్వ ఆసుపత్రి రక్త కేంద్రాలకు 2 యూనిట్లు ఇచ్చే విధంగా చూడాలన్నారు. రక్త అవసరాన్ని బట్టి ఆన్‌లైన్‌లో కూడా ఈ-రక్త పోషణ అనే యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. హై రిస్క్ గర్భవతులను గుర్తించి ఒక వారం ముందే వారిని ఆసుపత్రిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లెప్రసీని గుర్తించడానికి గాను ఇప్పటి వరకు 23 లక్షల మందిని పరీక్షించామని, వాటిలో 2600 మంది అనుమానితులను గుర్తించామని, వారిలో ఇప్పటి వరకు 42 కేసులు నమోదు అయ్యాయన్నారు. ఇంకా 1300 మందిని పరీక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. రక్త హీనతతో ఉన్న గర్భవతులను మండలాల పరంగా సచివాలయల పరిధిల ప్రకారం ఎక్కువ సంఖ్య నుండి తక్కువ సంఖ్య వరకు తయారు చేసి నివేదికలు ఇవ్వాలని ఐసిడిఎస్‌పిడి కుమారి ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ రామ గిడ్డయ్య, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ రాంజీ నాయక్, ఐసిడిఎస్ పిడికెఎల్‌ఆర్‌కె కుమారి, జిల్లా టిబి నియంత్రణ అధికారి భాస్కర్, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు

ఘనంగా కాటసాని ఉమామహేశ్వరమ్మ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ జన్మదిన వేడుకలను ఆమె స్వగహంలో కార్పొరేటర్లు ,డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు సర్పంచులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా కాటసాని ఉమామహేశ్వరమ్మ చేత ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కేక్ కట్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు, సర్పంచులు, డైరెక్టర్లు, జడ్పిటిసి సభ్యులు సహకార సొసైటీ అధ్యక్షులు వైసిపి నాయకులు కార్యకర్తలు కాటసాని ఉమామహేశ్వరమ్మకు పూల బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి సాన శ్రీనివాసులు దండు లక్ష్మీకాంతారెడ్డి నరసింహులు ఎరుకలి వెంకటేశ్వర్లు సాపూరి మాధురి, గాజుల శ్వేతారెడ్డి, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకటరమణారెడ్డి, జడ్పిటిసి సభ్యులు ఆల ప్రభాకర్ రెడ్డి, సల్కాపురం సర్పంచ్ బి.మద్దిలేటి జిల్లా సర్పంచు ల సంఘం మాజీ అధ్యక్షులు సిద్ధారెడ్డి శ్రీధర్ రెడ్డి, వైసిపి నాయకులు సాపూరి వీరయ్య, ఉలిందకొండ కెవి.రమణారెడ్డి సల్కాపురం వేణుగోపాల్‌రెడ్డి , పెద్దటేకూరు హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

అధికారుల సమన్వయ లోపం ప్రజలకు శాపం

కలెక్టరేట్‌కు అర కిలోమీటర్ దూరంలో ఉన్న దళితవాడ పై ఎందుకింత నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎస్‌సి కాలనీని పరిశీలిస్తున్న పుల్లారెడ్డి తదితరులు

రైల్వే మున్సిపల్ అధికారుల సమన్వయ లోపంతో ప్రజలు శాపంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్నూలు దేవ నగరులో రైల్వే, మున్సిపల్ అధికారుల సమన్వయ లోపంతో చిన్నపాటి చెరువులా మురుగు నీరు చేరి స్థానిక ప్రజలకు ప్రమాదకరంగా మారింది. ప్రజలు దుర్వాసన దోమల బెడదను భరించలేక పోతున్నారు. మంగళవారం దేవనగర్ లో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి సీనియర్ నాయకులు కె. ఈశ్వరయ్య, ఎం.నాగరాజు మాట్లాడుతూ ప్రజాప్రతితులు, ప్రభుత్వ అధికారులకు మురుగునీటిని చూసి వెళ్లారు. తప్ప పరిష్కరించలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కలెక్టరేట్‌కు అర కిలోమీటర్ దూరంలో ఉండే దళితవాడ పై ఇంత నిర్లక్ష్యమా అంటూ పిపిఎస్ఎస్ ప్రతినిధి బందం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రమాదకరంగా మారిన మురుగునీటి గుంతలను వెంటనే మరమ్మతులు చేసి స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ పర్యటనలోఎన్. శ్రీనివాస్ రెడ్డి,ఎ. వెంకటేశ్వర్లు, పి. ఇక్బాల్,ఎన్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉంటూ.. క్రీడలకు దగ్గర అవ్వాలి

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్

యువత దురలవాట్లకు దూరంగా ఉంటూ.. శారీరక ధారుఢ్యం, ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలకు దగ్గర అవ్వాలని ,ఎక్కువ సమయం క్రీడా మైదానాలలో గడపాలని మాజీ కార్పొరేటర్ గుడిపల్లె సురేంద్ర అన్నారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్, షూటింగ్‌బాల్, కిక్‌బాక్సింగ్, జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఎస్‌జిఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య ,జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, శ్రీనాథ్ ,పుల్లన్న, కిషోర్, కృష్ణ, తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపికను ప్రారంభించారు. సురేంద్ర మాట్లాడుతూ చిన్నారులు పాఠశాల స్థాయి నుండే శారీరక దారుఢ్యం, ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి ..శారీరక కదలికలు ఉన్న క్రీడలను ఎంచుకోవాలన్నారు. దేశభక్తిని పెంపొందించు కోవాలన్నారు. లక్ష్మయ్య మాట్లాడుతూ గత వారం రోజులపాటు జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమానికి సుమారు 9,000 నుండి 10,000 మంది బాల బాలికలు హాజరయ్యారన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు, ఉపాధ్యాయులకు, జిల్లా విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇకి 17 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయంలో ఎస్ఇ చాంబర్లో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 17ఫోన్ కాల్స్ వచ్చాయని ఎస్ఇ ఎం.ఉమాపతి తెలిపారు. ఇందుకు ప్రధానంగా బిల్లులకు సంబంధించి నాలుగు, విద్యుత్తు లైన్లకు సంబంధించి మూడు, తరచూ విద్యుత్తు అంతరాయం గురించి (డిటి ఆర్ ఫైల్యూర్) ఒకటి, ఇతరములు ఏడు, ఫోన్ కాల్స్ వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. డబ్బులతో కూడినవి మాత్రమే ఆలస్యం అవుతుందని, మిగిలినవన్నీ వీలైనంత త్వరలో సంబంధిత అధికారులతో పూర్తి చేయిస్తామని ఎస్‌సి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఇ తో పాటు డిఇ విజయభాస్కర్ పాల్గొన్నారు.

సైకో పాలనను సాగనంపుదాం : కెఇ శ్యాంబాబు

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సైకో పాలనను సాగనంపుదామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఇ.శ్యాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమం పేరుతో సంక్షోభం సృష్టిస్తున్నారన్నారను. సైకో పాలన కొనసాగిస్తున్నారని, సైకో పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెదేపా చేపట్టిన ఇదేమి ఖర్మ రాష్ట్రానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని తెలిపారు. అధికార పార్టీ నాయకులు గుట్టు చప్పుడు కాకుండా ఇసుక మాఫియా, అంతరరాష్ట్ర మద్యం మాఫియా, మట్టి మాఫియా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలపై అన్ని రకాల వస్తువుల ధరలపై విపరీతమైన బారాలు మోపడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాబోయే సాధారణ ఎన్నికలలో టిడిపి అధికారంలోకి తీసుకువచ్చేందుకు, తెదేపా శ్రేణులు ప్రతి ఒక్కరు సైనికుడులా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు, రామానాయుడు, టిడిపి రైతు సంఘం నాయకులు తిమ్మయ్య చౌదరి, పెద్ద హుల్తి మాజీ సర్పంచ్ తిప్పన్న, నాయకులు మీరా హుస్సేన్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

అయ్యప్ప అంతిమ యాత్రలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు

కెవిపియస్ జిల్లా కమిటి సభ్యులు అయ్యప్పకు కన్నీటి వీల్కోలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

గుండె పోటుతో మరణించిన కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు పెద్ద కడుబూరు మండలం కాటికాపరుల సంఘం మండల కార్యదర్శి కెబి అయ్యప్పకు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి కనకవీడు రాజు, జిల్లా కమిటీ సభ్యులు ఆనందరావు, ఎమ్మిగనూరు మండల నాయకులు ప్రసాద్ లు ఆయన మతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ సామాజిక ఉద్యమం అనేదే ఒక సమస్యల సుడిగుండమని, అలాంటి ఉద్యమంలో తన తండ్రి కెవిపిఎస్ మండల కార్యదర్శి కెబి.ఆనందరాజుకు, తోడుగా తాను సైతం కెవిపిఎస్ జెండాను మోసి, పెద్దకడుబూరు మండలంలో ఉన్న అణగారిన దళిత, గిరిజనులకు అయ్యప్ప అండగా నిలిచారన్నారు. కెవిపిఎస్ అనుబంధ సంఘమైన కాటి కాపరి గుంతలు తీసే బేగరుల సంఘానికి మండల కార్యదర్శిగా వుంటూ కాటికాపర్లను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలనే పోరాటంలో ప్రధాన భూమిక పోషిస్తున్న అయ్యప్ప అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడం సామాజిక ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అయ్యప్ప కుటుంబానికి సంఘం సభ్యులంతా అండగా నిలుస్తామన్నారు.

మాట్లాడుతున్న బెళగల్ ఎంపిపి

రోడ్ల దుస్థితిపై మండల సమీక్షలో ఆగ్రహం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ఏ మూల చూసినా రోడ్లు అధ్వాన్న స్థితికి చేరడంతో మంగళవారం సర్వసభ్యసమావేశంలో ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు, అధికారులు ఆగ్రహజ్వలలు వ్యక్తం చేశారు. ప్రతి సమీక్షలో చర్చకు రావడం, చేస్తామని చెప్పడం సరికాదని అభివృద్ధిని పట్టించుకున్నాకే సమీక్షకు హాజరుకావాలని హెచ్చరించారు. ఆయా అభివృద్ధి పథకాలు, అభివృద్ధి నివేదికలపై చర్చించి ఐక్యకార్యాచరణ చేపట్టాల్సిందిగా ఎంపిపి బొంతల మునెప్ప సమీక్షలో కోరారు.

మెరుగైన పాలన అందించే వారిని గుర్తించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజలకు మెరుగైన పాలన అందించే వారిని మాత్రమే గుర్తించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం పేర్కొన్నారు. నగరంలోని కర్నూలు ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్కే డేవిడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అక్కడ ఎలాంటి అభివద్ధి జరగలేదన్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని పంచుకొని ఏలుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న పాలనపై ప్రజలు మననం చేసుకోవాలన్నారు. నిజాయితీగా నిస్వార్థంగా సేవ చేసే వారిని మాత్రమే రాబోయే కాలంలో గెలిపించాలని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజా పరిరక్షణ సమితి నాయకులు, శ్రీనివాసరెడ్డి, గౌరెడ్డి, నాజర్, ప్రదీప్, రావత్, ప్రసాద్ యాదవ్, రవిప్రసద్, శివప్రసాదరావు, బలంకి రెడ్డి, కృష్ణ, మురళి, పోసానిపాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి నారాయణదాసు అధ్యక్షతన నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన చిన్నహుల్తి సర్పంచి కేశవరెడ్డి, చక్క రాళ్ల సర్పంచి శ్రీరాములు, కోతి రాళ్ల సర్పంచి ఆంజనేయులు తమ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, హౌసింగ్, అంగన్ వాడికి సంబంధించిన అధికారులను పలు సమస్యలపై ప్రశ్నించారు. ఆయా శాఖల అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వగా, సమస్యల పరిష్కారానికి నిర్దేశిత గడువు లోపల కషి చేయాలన్నారు. లేనియెడల ఎంతటి వారినయినా ఉపేక్షించేది లేదని ఎంపిపి నారాయణదాసు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పార్థసారథి, తహశీల్దార్ విష్ణు ప్రసాద్, డిఎల్‌పిఒ శ్రీకాంత్ చౌదరి, జడ్‌పిటిసి ఉరుకుందమ్మ, వైస్ ఎంపిపి బలరాముడు, రంగమ్మ, కో ఆప్షన్ సభ్యులు నజీర్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

ఎంఎల్‌టి లకు అప్రెంటిషిప్ శిక్షణ

కేక్‌కట్ చేసి ప్రారంభించిన సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధనవంత్రి హాల్‌లో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లకు అప్రెంటిషిప్ ట్రైనింగ్‌ను అడిషనల్ డిఎంఇ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి ప్రారంభించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ధనవంత్రి హాల్ నందు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ 15 మంది విద్యార్థులు అప్రెంషిప్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అప్రెంటిషిప్ ట్రైనింగ్ ద్వారా విద్యార్థులకు ఎక్కడైనా నైతిక విలువలు , చిన్నపిల్లల దగ్గర నుండి పెద్ద వయసు వరకు పేషంట్స్‌కు సేవచేసే అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగంజన్, బయోకెమిస్ట్రీ ల్యాబ్ ఇంచార్జ్ స్వాములు, ఎంఎల్‌టి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలి

- రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, వారికి చట్టపరిధిలో సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. మంగళవారం ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ అఫెన్స్ కేసుల దస్త్రాలను పరిశీలించి త్వరగా రికవరీ చేసి సంబంధిత ఫిర్యాదిదారులకు అందించాలని ఆదేశించారు. నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా అరికట్టాలన్నారు. క్రైమ్ అగెనెస్ట్ ఉమన్ కేసులకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలని, మహిళల అదృశ్యం కేసులు పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి ఆచూకీ త్వరగా కనుగొని సంబంధించిత వారికి అప్పగించాలని ఆదేశించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. ఆళ్లగడ్డ టౌన్‌లో నైట్ బీట్, బ్లూకోట్‌పై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని, రాత్రి వేళలో గస్తీ నిర్వహించి ఎలాంటి దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమస్యలను అడిగి తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సుధాకర్ రెడ్డి, పట్టణ సిఐ జీవన్ గంగానాథ్ బాబు, ఎస్సైలు తిమ్మయ్య, వెంకటరెడ్డి, ఎస్పీ సిసి ఫయాజ్ బాష తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాల ముఠాను కఠినంగా శిక్షించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పాణ్యం మండలం పిన్నాపురం గ్రామ రైతుల భూములను బినామీ పేర్లతో కాజేయడానికి ప్రయత్నించిన ముఠాను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో రైతులు, పేదలు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం దాదాపు 6 వేల ఎకరాలను గ్రీన్ కో కంపెనీకి కట్టబెట్టిందని చెప్పారు. పట్టాలు ఉన్న రైతులుకు తక్కువ నష్టపరిహారం ఇచ్చి కంపెనీ చేతులు దులుపుకుందని విమర్శించారు. మిగిలిన ప్రభుత్వ భూములు, బంజరు, ఏడబ్ల్యూ భూములు, ఫారెస్ట్ భూములకు సంబంధించిన రైతులకు ఎటువంటి నష్ట పరిహారం ఇవ్వకుండా కంపెనీ కాలయాపన చేస్తుందని చెప్పారు. నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతుందన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టి. రమేష్ కుమార్

ప్రభుత్వం వైపు నుండి కూడా ఒత్తిడి తేవడం జరుగుతుందని, ప్రభుత్వ భూములకు పట్టాలు లేవు కాబట్టి సాగులో ఉన్న వారిని గుర్తించి వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకులు, అవినీతికి అలవాటు పడ్డ ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై పాణ్యం ఎమ్మార్వో ఆఫీస్ కేంద్రంగా 1908 ఆర్ఎస్ఆర్ రికార్డులో నకిలీ సీల్లు, పేర్లు ఎక్కించి దాదాపు 140 ఎకరాలు, ఎకరా 10 లక్షల చొప్పున రూ. 14 కోట్లు కాజేయడానికి పథకం రూపొందించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ అండదండలు లేనిదే ఇంత పెద్ద భూ కుంభకోణం జరగదన్నారు. పాణ్యం, గడివేముల తహశీల్దార్ కార్యాలయాలే కేంద్రంగా ప్రభుత్వ భూములు కాజేయడానికి పెద్ద ఎత్తున జరుగుతున్న కుట్రలను జిల్లా అధికారులు గమనించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పిన్నాపురం గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సాగులో ఉన్న రైతులను, వారి భూములను గుర్తించి 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో లబ్ధిదారుల భూములు అధికార పార్టీ, అవినీతి అధికారుల అనునాయులకు అన్యాక్రాంతం అవుతాయని తెలిపారు. భూములు కాజేయడానికి ప్రయత్నించిన వారిని, వారికి అండగా నిలిచిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు నంద్యాల క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని డిఎస్ఎ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్-17, 14 విభాగాల్లో జీత్ కునే డో కరాటే రాష్ట్రస్థాయి పోటీలకు నంద్యాలకు చెందిన క్రీడాకారులు 10 మంది ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక క్రీడా సమాఖ్య కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో జీత్ కునే డో కరాటే సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ పాల్గొని ఎంపికైన క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్లు బాలకృష్ణ, లాల్ తరుణ్, నాగేంద్రలను అభినందించారు. అండర్-14లో టెక్కే పురపాలక పాఠశాల బాలిక సఖియా, శ్రీ సంకల్ప స్కూల్ హుస్సేన్ భాష, నవభారత్ స్కూల్ రాజు, స్వామి వివేకానంద స్కూల్ సునీల్ కుమార్, మోడల్ స్కూల్ తిమ్మాపురం జస్వంత్, సమిత్ కుమార్, అండర్-17లో శాంతినికేతన్ స్కూల్ హాసిని, శ్రీ చైతన్య స్కూల్ యశశ్విని, సన, స్వామి వివేకానంద స్కూల్ శ్రీనివాసులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళారాధన నాటక కార్యదర్శి ఎస్ఆర్ఎస్.ప్రసాద్, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలన

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని కానాల, బిల్లలాపురం, చాపిరేవుల, పాండు రంగాపురం గ్రామాల్లోని వరి పంట పొలాలను జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్, కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.రామకృష్ణారావు, నంద్యాల ఏడిఏ డి.రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి స్వాప్నిక, రైతు భరోసా కేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మంగళవారం సందర్శించారు. మాండూస్ తుఫాన్ ప్రభావానికి వరి కంకులు వాలిపోయినట్లు గమనించారు. అలాగే కల్లాల్లో ఆరబెట్టి ధాన్యంను పరిశీలించారు. డాక్టర్ ఏ.రామకృష్ణారావు మాట్లాడుతూ వర్షాల వల్ల వాలిపోయిన కంకులను పైకి ఎత్తి కట్టలుగా కట్టి నిలబెట్టాలన్నారు. నూర్చిన తర్వాత వరి ధాన్యం తడిస్తే క్వింటాలు వడ్లకు ఒక కిలో ఉప్పు, 4 కిలోల ఊక లేదా ఎండుగడ్డి (చిన్న చిన్న ముక్కలుగా) చేసి కలిపి కుప్పగా పోసి సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు.

వర్షాలకు నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నోషనల్ భూముల క్రమబద్దీకరణకు అనుమతులు

జాయింట్ కలెక్టర్ లాగిన్ నుంచి చర్యలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని నోషనల్ భూములను జెసి లాగిన్ నుండి క్రమబద్ధీకరణ చేయడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అనేక ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటూ అనుభవలో ఉన్న రైతులకు నోషనల్ భూములపైన యజమాని హక్కు లేకపోవడంతో పట్టాదారు పాసు బుక్‌కు దరఖాస్తు చేసుకుంటే వాటిని ఆన్‌లైన్ ఎక్కించకుండా పక్కన పెడుతూ వస్తున్నారు. అప్పట్లో రెవిన్యూ అధికారులు కొంతమంది క్షేత్రస్థాయిలో పరిశీలించి సరైన వివరాలు పొందుపరచక పోవడంతో వాటి యజమాని పేర్లు అడంగల్‌లో లేకపోవడం వంటి సమస్యలు ఉండటంతో అలాంటి భూములను నోషనల్‌గా ప్రకటించారు. దీంతో నిజమైన రైతులు ఏళ్ల నుండి తమ అనుభవంలో ఉన్నా తమ పేరు మీద మార్చుకొని ఆన్‌లైన్, పట్టాదార్ పాస్ బుక్ పొందడానికి తహసీల్దార్‌లు స్పందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే వ్యవహారం శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన బోయ మౌలాలి సర్వే నంబర్ 500/2లో 2.62 ఎకరాలు విస్తీర్ణం భూమిని కొనుగోలు చేసి రిజిస్టార్ చేయించుకున్నాడు. అయితే ఈ భూమి ఆన్‌లైన్ కాలేదు. కారణం నోషనల్ భూమి అనే పేరు ఉండడమే. ఇలాంటి భూములు జిల్లాలో అనేకంగా ఉండడంతో అనుభవంలో ఉన్న రైతులు తమ భూములు ఆన్‌లైన్ కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఇటీవల కాలంలో 1954 ముందు అసైన్డ్ చేసిన చుక్కల భూములను, ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ చేస్తుంది. నోషనల్ భూములను కూడా జెసి క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో నోషనల్ భూముల రైతులకు ఊరట లభించనుంది.

మాండూస్ బాధిత రైతులను ఆదుకోవాలి : రైతు సంగం

ప్రజాశక్తి - రుద్రవరం

మాండూస్ తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని నందికొట్కూరు, కోవెలకుంట్ల, నంద్యాల, గోస్పాడు, పాణ్యం, బనగానపల్లె ప్రాంతాల్లో శనగ, పండుమిర్చి పంటలు పూత, కాయలు పూర్తిగా రాలిపోయాయని తెలిపారు. పొలాల్లో కోత కోసి కుప్పలుగా ఉన్న మినుము పంట పూర్తిగా తడిసిపోయిందన్నారు. వరి పంట అక్కడక్కడ పూర్తిగా పడిపోయిందన్నారు. కోసిన వరి ధాన్యం కుప్పల్లో వడ్లు వేడెక్కి రంగు మారాయని తెలిపారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఉన్న పంటలను రక్షించుకునేందుకై తగిన సూచనలు, సలహాలు వ్యవసాయ అధికారులు వెంటనే రైతులకు ఇవ్వాలని కోరారు.

పెట్రోల్ ట్యాంకర్‌లో భారీ విస్ఫోటనం - వ్యక్తి మృతి

ప్రజాశక్తి - శిరివెళ్ల

భారీ విస్ఫోటనంతో గాల్లోకి ఎగిరి కింద పడి మృతి చెందిన మెకానిక్ నాగరాజు

మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో మంగళవారం పెట్రోల్ ట్యాంకర్ నుండి భారీ శబ్దంతో విస్ఫోటనం సంభవించిన ఘటనలో మెకానిక్ నాగరాజు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యర్రగుంట్ల పెట్రోల్ బంక్‌కు సంబంధించిన పెట్రోల్ ట్యాంకర్ లారీ డ్రైవర్ పైనున్న మూత మరమ్మతుల కోసం లారీని బస్టాండ్ సమీపంలో ఉన్న ట్రాక్టర్ మెకానిక్ నాగరాజు వద్దకు తెచ్చాడు. నాగరాజు ట్యాంకర్ పైకి ఎక్కి మూత రిపేర్ చేస్తుండగా ఒక్క సారిగా భారీ శబ్దంతో హైర్ ఓపెన్ అయింది. మెకానిక్ నాగరాజు (30) సుమారు 35 అడుగుల పైకి గాలిలోకి ఎగిరి మార్తోమా చర్చి అవరణలో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. భారీ శబ్దంతో ప్రజలు ఏమయిందోనని ఉలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి ప్రమాద సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్సై శరత్ కుమార్ రెడ్డి మెకానిక్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

పాదచారులకు ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఫుట్ పాత్‌లపై నడిచే పాదచారులకు ఇబ్బందులు లేకుండా చిన్న వ్యాపారులు వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి. రవిచంద్ర రెడ్డి ఆదేశించారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్ తన ఛాంబర్‌లో టౌన్ ప్లానింగ్ ఎసిపితో కలిసి తోపుడుబండ్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు సైడు ఫుట్ పాత్‌లపై కుర్చీలు వేయకుండా, వాహనాలు పార్కింగ్ చేయకుండా వ్యాపారం చేసుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెళ్లి పరిశీలిస్తారని తెలిపారు. అలాగే వ్యాపారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న తపాలా శాఖ ఎస్‌పి శ్రీనివాసరావు

సుకన్య పథకం ఆడపిల్లలకు ఆర్థికవరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

భారత ప్రభుత్వ తపాలా శాఖ ప్రవేశపెట్టిన సుకన్య పథకం ఆడపిల్లలకు ఆర్థిక వరమని నంద్యాల డివిజన్ తపాలా శాఖ ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తపాలా ఎస్పీ శ్రీనివాసరావు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి సుకన్య పథకం విశిష్టత, ఉపయోగాలను వివరించి ఎమ్మెల్యే సహకారాన్ని కోరారు. తాలూకాలోని ప్రతి బాలికకు ఈ పథకాన్ని అందించేందుకు ఆళ్లగడ్డ పోస్టల్ శాఖ ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలియజేశారు. అలాగే సిఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసే ఈ-పోస్టు పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ భాస్కర్ రెడ్డి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మౌళీశ్వర రెడ్డి, పోస్టుమాస్టర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు వేయండి : ఎంపిపి

ప్రజాశక్తి - శిరివెళ్ల

గ్రామాల అభివృద్ధికి సర్పంచులు బాటలు వేయాలని ఎంపిపి నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్ ముజఫర్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి విడుదలయ్యే నిధులను ఉపయోగించి గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ భవనంలో గ్రామ సభలు నిర్వహించి సభ్యులందరి ఏకాభిప్రాయంతో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ షేక్ ముగిద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఆచారి, ఈఓపిఆర్‌డి సాల్మన్ రాజ్, ఇతర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి

సంక్షోభంలో వ్యవసాయ రంగం : ఎఐకెఎస్

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోంభంలో కూరుకుపోతుందని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బారాయుడు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ కూడలిలో జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బా రాయుడు, సిఐటియు డివిజన్ అధ్యక్షులు జివి.సుబ్బయ్యలు రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అప్పుల ఊబిలో నుండి బయటపడి, వ్యవసాయం నుంచి బతకాలంటే స్వామినాథ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు బ్యాంకు ద్వారా విరివిరిగా రుణాలు ఇవ్వాలన్నారు. ఆదాయ భద్రత కల్పించాలని, అన్ని రకాల వ్యవసాయ పరికరాలను, ఎరువులను సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్ల బిగింపు తక్షణమే రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, బ్రహ్మం, సుధాకర్, మధు శేఖర్, మధు ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని.. యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని యువకుడు బాలాంజనేయులు(23) ఆత్మహత్య చేసుకుంటున్నాని సెల్‌ఫోన్‌లో సెల్ఫీ తీసుకుని పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మృతుడి బంధవులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మాపురం గ్రామానికి చెందిన సుంకన్న, రమణమ్మల కుమారుడు బాలాంజనేయులు కర్నూలు బుధవారపేటలో బంధువుల ఇంట్లో ఉంటూ పిజి చదువుకుంటున్నాడు. అదే కాలనీకి చెందిన మెడిసిన్ చదువుతున్న యువతి, బాలాంజనేయుడు గత ఐదేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. యువతి మరో యువకునితో ఉన్న ఫొటోను బాలాంజనేయులు చూసి తీవ్ర మనస్థాపానికి గురై సొంత గ్రామం లక్ష్మాపురం చేరుకున్నాడు. గ్రామ సమీపాన ఉన్న సమ్మర్ స్టోరేజీ వద్ద తాను చనిపోతున్నట్లు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. బంధువులకు ఫోన్ చేసి పురుగు మందు తాగాడు. బంధువులు సమ్మర్ స్టోరేజీ వద్దకు వెళ్లగా స్పృహ తప్పి పడిపోయిన బాలాంజనేయులును వెంటనే నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలాంజనేయులు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలాంజనేయులు మృతదేహం

పేద మహిళా పూల వ్యాపారికి ఫ్రిజ్ విరాళం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణంలోని హరిజనవాడకు చెందిన పూల వ్యాపారి చిట్టెమ్మకు నీడ్ ఫర్ హెల్ప్ టీం మంగళవారం ఫ్రిడ్జ్‌ను విరాళంగా అందజేశారు. తామర పూల చిట్టెమ్మ గత 15 సంవత్సరాల నుంచి తామర పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. తామర పూలను భద్రపరుచుటకు తనకు ఒక ఫ్రిడ్జ్ కావాలని నీడ్ ఫర్ హెల్ప్ టీం సభ్యులు వసుమతి, శాంతకుమారి, జానకి, భాగ్యలక్ష్మిలను సహాయం కోరింది. వారు అడిగిన వెంటనే పది రోజులలో 12 వేల రూపాయల ఫ్రిడ్జ్ కొనిచ్చి, దానితోపాటు ఆమె వ్యాపారానికి సంబంధించిన వస్తువులు, బట్టలు అందజేశారు. కార్యక్రమంలో సోమశేఖర్, సురేంద్ర, శ్రీనివాసులు, సురేష్, హరిజన పేట ప్రజలు పాల్గొన్నారు.

బొమ్మలసత్రం బ్రిడ్జి కింద వైన్‌షాప్‌ను ఎత్తేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టణంలో నిత్యం విద్యార్థులతో, ప్రజలతో రద్దీగా ఉండే బొమ్మలసత్రం బ్రిడ్జ్ కింద ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైన్ షాప్‌ను తక్షణమే ఎత్తివేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాముడు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలు, విద్యార్థులు ధైర్యంగా తిరగడానికి ఆటంకంగా మారనున్న బొమ్మలసత్రం వైన్ షాప్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. హైకోర్ట్‌కు సైతం వెళ్లి స్టే తెస్తామన్నారు. తక్షణమే వైన్ షాప్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, మనోహర్, విష్ణు, రవి, శశి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేశమంతా ఒకే పింఛన్ పథకాన్ని అమలు చేయాలి : ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రభుత్వ ఉద్యోగులకు దేశవ్యాప్తంగా ఒకే పింఛను పథకాన్ని, అదీ పాత విధానాన్నే అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి డిమాండు చేశారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల, యాగంటి పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా జరపాలని, ఏ ఒక్క ఉపాధ్యాయునికి నష్టం జరగకుండా పాయింట్ల కేటాయింపు తదితర అంశాలపై ప్రభుత్వం జీవోల్లో మార్పులు తేవాలని చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సుజాతకు జీవోల ప్రతిని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌జెయుపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, కోటా ఓబులరెడ్డి, నాయకులు రాంపుల్లారెడ్డి, జానకిరామిరెడ్డి, పీడీ సంఘం నాయకులు హరి, సిపిఎస్ నాయకులు హబీబుల్లా, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు జీతాలు చెల్లించాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉద్యోగ, ఉపాధ్యాయ ,పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.మాధవస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన తెలపగా నేడు కొంతమంది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు జీతాలు జమ చేశారన్నారు. ఇంకా చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు , పెన్షనర్లకు జీతాలు జమ కావాల్సి ఉందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీని జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం మధుసూదన్ రావు జిల్లా ఉపాధ్యక్షులు లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్‌లు నాగరాజు, సుబ్బరాయుడు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట కృష్ణుడు, సుంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని దొర్నిపాడు మండలం రామచంద్రాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధినీ వివరించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగ అనసూయ, తాహసిల్దారు జయప్రసాద్, జడ్పిటిసి శకుంతలమ్మ, ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ చెంచి రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ బబ్బురి ఉమాదేవి, వైసిపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మోహన్ నాయుడు, మనోహర్ రెడ్డి, లక్కు చంద్రశేఖర్ రెడ్డి, బబ్బూరి వెంకటస్వామి, బబ్బురి కృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

అంగన్వాడీ కేంద్రాలకు కందిబ్యాళ్లు సరఫరా

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఈ నెల 2న 'అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా కానీ కంది బ్యాళ్లు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. అంగన్వాడీ కేంద్రాలకు 1300 కేజీల కంది బ్యాళ్లు మంగళవారం మంజూరయ్యాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీవాణి మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 50 అంగన్వాడి సెంటర్లలో పిల్లలు 2987 మంది, బాలింతలు, గర్భిణీలు 772 ఉన్నారని తెలిపారు. వీరికి కంది బ్యాళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

వ్యకాసం జాతీయ మహాసభకు ప్రతినిధిగా సుధాకర్

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభకు ప్రతినిధిగా నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌ను ఎన్నుకోవడం పట్ల ప్రజా సంఘం నాయకులు బందెల ఓబులేసు, వడ్డే సుబ్బారాయుడు, వ్యకాసం నాయకులు రాములమ్మ, అచ్చమ్మ, జోసెఫ్ రమేష్, మురళిలు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ప్రాంతం వ్యవసాయ కార్మికుల గురించి ప్రస్తావించి, వారి కోసం పోరాటం చేయాలని ఆకాక్షించారు.

పట్టా భూములు ఇచ్చి దళితులకు బీసీలకు ప్రత్యామ్నాయ భూములను చూపిస్తామని లబ్ధిదారులకు చెబుతున్న ఎమ్మెల్యే

పట్టాలిచ్చిన దళితులకు భూములు చూపించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మిడుతూరు

పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇచ్చిన దళితులకు, బీసీలకు భూములను చూపించాలని తహశీల్దారును నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ ఆదేశించారు. మంగళవారం నాడు మిడుతూరు మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే ఆర్థర్‌కి సిపిఎం మండల కన్వీనర్ టి ఓబులేసు స్థానిక దళితులతో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. ఓబులేసు మాట్లాడుతూ మిడుతూరు మండల కేంద్రంలోని 46 కుటుంబాలు దళితులు, బీసీలకు 1996లో పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని, లబ్ధిదారులు బ్యాంకులో రుణాలు కూడా తెచ్చుకోవడం జరిగిందని, కానీ ఇంతవరకు వారికి భూములు చూపలేదని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ భూములను చూపించాలని, లేనియెడల ప్రత్యామ్నాయం భూములు చూపించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతులు శుజ్ఞానం, జయరాముడు, తిరుపాలు, తిరుపతయ్య, మహిళలు పాల్గొన్నారు.

వర్దమాన్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని వర్దమాన్ గ్రామంలో వైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్య అధికారి సుబ్రమణ్యం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లాలో 105 గ్రామాలలో లింక్ వర్కర్స్ స్కీమ్ పనిచేస్తోందని, హెచ్‌ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధులు మరియు టీబీ గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పి.నాగరాజు, డీఆర్‌పి రాఘవేంద్ర, లింక్ వర్కర్ బుజ్జమ్మ, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు బసిరెడ్డి కళాశాల విద్యార్థిని

ప్రజాశక్తి - నందికొట్కూరు

జాతీయ స్థాయి వాలీబాల్ యూత్ నేషనల్ పోటీలకు నందికొట్కూరులోని బసిరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థిని కవిత ఎంపికయ్యినట్లు కర్నూలు జిల్లా వాలీబాల్ కార్యదర్శి షరీఫ్ అహ్మద్ మంగళవారం తెలిపారు. ఈనెల 16 నుండి 22 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని పన్నాలో జరుగుతున్న 25వ నేషనల్ యూత్ ఛాంపియన్ షిప్ లో కవిత పాల్గొంటారని వారు తెలిపారు. యూత్ నేషనల్ ఛాంపియన్షిప్‌కు కవిత ఎంపిక కావడం పట్ల స్థానిక క్రీడాకారుడు జాఫర్ మున్న అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వాసవి రైస్ మిల్లులో తనిఖీలు

ప్రజాశక్తి - వెలుగోడు

పట్టణంలోని వాసవి రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని నూకలుగా చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 528 బస్తాల నూకలను వెలుగోడు తహశీల్దార్ బోయకాటి శ్రీనివాసులు, ఆత్మకూరు సిఐ సుబ్రహ్మణ్యం సీజ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ వాసవి రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేపట్టామని తెలిపారు. సీజ్ చేసిన నూకలను నంద్యాల గిడ్డంగులకు తరలించామని మిల్లు ఓనర్ పై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాల పట్టణంలో జరుగు సిఐటియు నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, కన్వీనర్ వై ఎల్లయ్య కార్మికులకు సూచించారు. మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నందు బేతంచెర్ల మండలం సిఐటియు 9వ మండల మహాసభ మండల అధ్యక్షుడు వైబి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ కార్యాలయ ఆవరణంలో సిఐటియు జెండా ఆవిష్కరణను లారీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు సిఐటియు మండల గౌరవాధ్యక్షులు ఎస్ సాధిక్ హుస్సేన్ జెండా ఆవిష్కరించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు జిసేబారాణి, వై ఎల్లయ్యలు మాట్లాడుతూ కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మికుల అశేష త్యాగాలతో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణలు చేసి కార్మికులను

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు

కట్టు బానిసలుగా చేయడానికి కుట్రలు పన్నుతోందన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారు వ్యవస్థకు అనుగుణంగా ఉండేందుకు చట్టాలు చేయడం దుర్మార్గం అన్నారు. పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీ రుణాలను ఇవ్వడం, ఆ మరుసటి సంవత్సరమే రుణాలను రద్దు చేస్తూ సామాన్యులపై అధిక భారాలను మోపుతుందన్నారు. బిజెపి విధానాలపై పోరాటాలకై సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఆర్ వెంకటలక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, ఎస్‌కే బాష, అంగన్వాడి మండల నాయకురాలు ఎంకే నాగలక్ష్మి గుల్జార్బి, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు రంగడు, పద్మావతి, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు రాజబాబు, నరసింహులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు సంజీవ నాయుడు, హరినాథ్, రామాంజనేయులు, ప్రసాద్, పెద్దన్న మద్దిలేటి స్వామి, బుగ్గ రామాంజనేయులు, హమాలి వర్కర్స్ యూనియన్ ఖాసిం వలి, తిమ్మయ్య, మల్లికార్జున, కార్మికులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** నంద్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే సిఐటియు రెండో మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, రాజు కోరారు. మంగళవారం మార్కెట్ యార్డ్ గోడౌన్ కార్మికులతో కలిసి వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, హమాలీ కార్మికులకు పెన్షన్, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణ, జయన్న, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను మున్సిపల్ చైర్మన్ తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆత్మకూర్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా మంగళవారం ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డాక్టర్‌ను నియమించే విధంగా వైసిపి ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్‌తో కలిసి గర్భిణీలకు ప్రతి నెలలో చేపడుతున్న స్కానింగ్ కేంద్రాన్ని సందర్శించారు.పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అత్యధిక ఆధునీకరణ పరికరాలతో త్వరలోనే వైద్య సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, వైద్యశాల సూపరింటెంట్ వెంకటరమణ, వార్డు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలి : ఏడిఏ

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండలంలోని బాపనంతపురం గ్రామంలో రైతులకు వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ద్వారా కష్టమ్ హైరింగ్ సెంటర్ కింద ట్రాక్టర్, విత్తనం గొర్రులు, రోటవేటర్లు వంటి రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను 40 శాతం సబ్సిడీపై సిహెచ్‌సి గ్రూప్ సభ్యులకు స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బి.అంజనేయ, మండల వ్యవసాయ అధికారి డి. విష్ణు వర్ధన్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఏడిఏ బి.అంజనేయ, మండల వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని, 50 శాతం బ్యాంకు లోను ఇస్తుందని తెలిపారు. సి. హెచ్.సి గ్రూప్ ద్వారా తీసుకున్న గ్రూప్ సభ్యులు ఆ ఊరిలోని రైతులకు బాడుగకు వాడుకొని బ్యాంకు లోను కట్టుకోవాలని తెలిపారు. కెడిసిసిబి ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ రవి కుమార్, ఎంపిఈఓ రాజమ్మ, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నాడు మండల పరిధిలోని మాధవరం, తిమ్మనపల్లె గ్రామాలలో నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఆయా గ్రామాలలో తాగునీటి, విద్యుత్, డ్రైనేజీ తదితర వాటిపై సంబంధిత అధికారుల దృష్టి సారించి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబల ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచి బ్రహ్మానంద రెడ్డి, మాధవరం శీను,

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ఎంపీపీ రమేష్, మండల వైస్ ఎంపీపీ నసిరుద్దీన్, వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్, సింగిల్ విండో చైర్మన్ వంగల నాగేశ్వర్ రెడ్డి, కాంట్రాక్టర్ రామ్మోహన్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బి శివ శంకర్ నాయుడు, సుదర్శన్, రమణ, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు. **ప్యాపిలి :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పిటిసి శ్రీరామ్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, డోన్ మాజీ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పులిరాజు, సర్పంచి లక్ష్మీదేవి, ఉప సర్పంచ్, భువనేశ్వర్ రెడ్డి, రాజా నారాయణమూర్తి, కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఏకైక సిఎం జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ లబ్ధి పొందిన లబ్ధి దారులకు వచ్చిన పథకాలను వివరించారు. తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీవో పజల్ రహమాన్, ఈఓఆర్డి బాలకృష్ణ, ఈఓ శివకుమార్ గౌడ్, టిఆర్ఎస్ ప్రభాకర్ రెడ్డి, ఎపిఓ రమణ, ఎంఈఓ శ్రీనివాసులు, రఘు, అంజి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత పెంపు

ప్రజాశక్తి - బనగానపల్లె

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వైజ్ఞానిక ప్రదర్శనలు పెంపొందిస్తాయని ఎంఇఒ స్వరూప, ఎస్ఐ రామిరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి, వారి ఆలోచనలను సానపెట్టి నూతన ఆవిష్కరణలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనలో మండలస్థాయిలోని 14 ప్రభుత్వ, 5 ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని 73 వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో నెహ్రూ విద్యాసంస్థల కరస్పాండెంట్ కోడూరు హరినాథ్ రెడ్డి, డైరెక్టర్లు కోడూరు కమల్ తేజారెడ్డి, రవితేజా రెడ్డి, విద్యార్థులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సంజామల :** వైజ్ఞానిక ప్రదర్శన వలన ఎంతో ఉపయోగం ఉందని ఎంఇఒ శుక్రు నాయక్ తెలిపారు. మండలంలోని పేరుసోమల జిల్లా పరిషత్ హై స్కూల్లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వారు తెచ్చిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, నాగరాజు, స్కూల్ చైర్మన్ గౌడ్, సిఆర్పి హుస్సేన్ భాష, ఆర్‌ఎంపిలు నరసింహమూర్తి, నాగరాజు, అన్ని పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాణ్యం : పాణ్యంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను, చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని పాణ్యం ఎంపిపి హుస్సేన్ బీ, ఎంఇఒ కోటయ్య నాయక్‌లు ప్రారంభించారు. వైసిపి నాయకులు సద్దల సూర్య నారాయణ రెడ్డి, చందమామ బాబు, వెంకటేశ్వర్లు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ఎంఇఒ తిమ్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫేయిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రదర్శన అంశాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, ఇన్చార్జి హెచ్‌ఎం రామకృష్ణయ్య, గణిత ఉపాధ్యాయులు జ్యోతి, సిఆర్‌పి ముబిన పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

బండి ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నందు ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి తెలిపారు. ఎంఇఒ మాట్లాడుతూ ఏకో ఫ్రెండ్లీ మెటీరియల్ విభాగంలో నజీమా ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని రెన్యువల్ ఎనర్జీ సిస్టం విభాగంలో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. సైన్స్ అండ్ క్లీనింగ్ విభాగంలో జడ్పి పాఠశాల విన్నపాడు విద్యార్థి ఎస్ ప్రణీత్, కార్బొనేటెడ్ ఇండికేటర్ సిస్టం సిగ్నల్ జోన్ సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో జ్యోతి హైస్కూల్ విద్యార్థి టీవీఎస్ ఇస్మాయిల్, మెటల్ డిటెక్టర్ వ్యాడి బ్రేకర్ మిషన్ ఎనర్జీ క్లైమేట్ చేంజ్ విభాగంలో ఇ భవ్య ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని, గ్లోబల్ వార్మింగ్ మ్యాథమెటికల్ అండ్ మోడలింగ్ విభాగంలో కె జయవర్ధన్ ఏపీ మోడల్ స్కూల్ ట్రిగ్నోమెట్రిక్ రేషన్ విభాగంలో ప్రతిభ కనపరచారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో వాసుదేవ గుప్తా, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సైన్స్ ఫెయిర్‌కు జడ్జిలు గౌరవించిన ఎస్‌ఎం బాషా, భాగ్యమ్మ శ్యామల, వైస్ ఎంపీపీ ముంతల మధు, రాణి, సర్పంచ్ ఎరుకల సంధ్య పాల్గొన్నారు.

పాములపాడు : విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

ఉపాధి హామీ పథకంలో పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం. కర్ణ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించి, ఏపీవో గౌరీ బాయ్, టెక్నికల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్ణ మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు ఒక వరం లాంటిదని, ఈ పథకంలో పని చేసి దాదాపు మూడు నెలలు అయినప్పటికీ ఇంతవరకు బిల్లులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేసిన 15 రోజుల్లోపు బిల్లులు చెల్లించాలని ఉన్నప్పటికీ పాలక ప్రభుత్వాలు చట్టాన్ని తుంగలో తొక్కడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ

వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అధికారులు స్పందించి ఉపాధి హామీ పని చేసిన వారందరికీ వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి జాబ్ కార్డులు మంజూరు చేయాలని, పని కోరిన వారందరికీ వెంటనే పనులు చూపించాలని, పని ప్రదేశంలో వసతులు కల్పించాలని, వలసలు నివారించాలని ఆయన కోరారు. ఏపీవో గౌరీ బాయ్ మాట్లాడుతూ.. పనిచేసి బిల్లులు మంజూరు కానీ వారు ఆధార్ జాబ్ కార్డు నెంబరు ఇస్తే ..వారందరికీ పెండింగ్ లో ఉన్న బిల్లులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి రసూల్, ఉపాధి కూలీలు ముస్తఫా, నారాయణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హలో బిసి - చలో కర్నూల్‌ను జయప్రదం చేయాలి : బిసి సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఈనెల 19వ తేదీ సోమవారం జరిగే హలో బిసి – చలో కర్నూల్ రిలే నిరాహారదీక్షను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంకేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు చింతకుంట కురుమూర్తి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు కోరారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తున్న బీసీలకు ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదన్నారు. 56 కార్పొరేషన్ డైరెక్టర్లు చైర్మన్లు ఏర్పాటు చేశారని వాటికి ఇంతవరకు బడ్జెట్ కేటాయించలేదని తెలిపారు. ప్రతి జిల్లాలో బిసి భవనం ఏర్పాటు చేయాలని జీవో ఉన్న కూడా వాటిని ఇంతవరకు అమలుపరచలేదని, బిసి భవనాలను ఐదు కోట్లతో కేటా యించి నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు కుల గణన, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్, తదితర సమస్యలపై రిలే నిరహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గోకారి, సిడి ఆంజనేయులు, కృష్ణ, కృష్ణమూర్తి, శ్రీనివాసులు ఆర్‌ఎంపి శ్రీనివాసులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు నాగరాజు, పగిడ్యాల మండలం అధ్యక్షులు బలరాముడు, గోర సాహెబ్ బుడగ జంగాల వెంకటేశ్వర్లు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న

ఎత్తిపోతల పథకాలకు నిధులివ్వాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

నియోజ కవర్గంలో ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి బీడు భూములకు సాగునీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ అఖిల భారత కిసాన్ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు ఏసన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని త్రిశూర్ జిల్లాలో అఖిల భారత కిసాన్ 35వ మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభలు రైతాంగ సమస్యలపై రాబోయే రోజుల్లో చేపట్టే ఉద్యమాలకు కార్యాచరణ చేపడుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మదర్ సాహెబ్, మహిళా సంఘం నాయకురాలు మాలంబి, ఉపాధ్యక్షుడు లింగన్న, కార్యదర్శి ఏసన్న, సహాయ కార్యదర్శి ఖాజా, ఆకుల రాము, దుబ్బన్న, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

సంక్షోభంలో వ్యవసాయ రంగం : ఏఐకెస్

ప్రజాశక్తి - ఆత్మకూర్

సంక్షోభంలో వ్యవసాయ రంగం ఉందని ఏఐకెఎస్, సిఐటియు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నాడు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ రైతు సంఘం కార్యాలయం దగ్గర పండ్ల తోటల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా ఏఐకేఎస్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి రణధీర్‌లు మాట్లాడుతూ వ్యవసాయ రంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. రైతాంగం పరిస్థితి మరింత దిగజారుతుందని స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం మద్దతు ధరల చట్టం తెస్తామని వ్యవసాయని లాభసాటిగా మారుస్తామని అధికారంలోకి వచ్చిన పాలకులు ఇచ్చిన వాగ్దానాలు గాలికి వదిలేసారన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు అప్రజాస్వామికంగా మూడు నల్ల చట్టాలను బిజెపి ప్రభుత్వం తెచ్చిందన్నారు. దేశంలోని 540 సంఘాలు ఐక్యమై నిర్బంధాలను ఎదుర్కొని ఏడాది పాటు సాగించిన ఉద్యమాన్ని తలదిన ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, నాయకులు సురేంద్ర, భాస్కర్, నంద్యాల టర్నింగ్ కౌలు రైతు సంఘం నాయకులు దుబ్బ లింగమూర్తి, శికామని, జమాల్ ఖాన్, రసూల్, నబిసా, లింగస్వామి, ఇమాంస, ముర్తుజా, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

15న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈ నెల 15వ తేదిన పగిడ్యాలలో ఉచిత వైద్య విబిరం నిర్వహిస్తునట్లు సర్పంచు పెరుమాళ్ళ శేషన్న మంగళవారం తెలిపారు. కర్నూలు శాంతిరామ్ లేజర్ కంటి వైద్యశాల సహకరంతో మాజి జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచు శేషన్న అద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు ఆయన తెలిపారు. పగిడ్యాల ట్యాంక్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తమన్నారు. ఈ అవకాశని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసింది : టిడిపి

ప్రజాశక్తి - డోన్

వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా స్థానిక 20వ వార్డు నందు డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడు తూ డోన్ పట్టణంలో ప్రజలు ముఖ్యంగా చిన్న పాటి వర్షానికే రోడ్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడు తున్నారని,వీధుల్లో వీధిలైట్లు లేక కష్టంగా ఉందని వార్డు ప్రజలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వైసిపి నాయకులు ప్రజల సమస్యలను గాలికి వదిలేసి వారు మట్కా, పేకాట, అక్రమ మద్యం, ఇసుక దోపిడి ఇలా అక్రమంగా సంపాదించుకోవడమే సరిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయ్ భట్, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున, నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ కార్యదర్శి జలదుర్గం విష్ణు, టిడిపి నాయకులు క్రిష్ణ ప్రసాద్,డోన్ పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు మర్రి ఉపేంద్ర డోన్ పట్టణ టిడిపి మైనారిటీ ఉపాధ్యక్షులు అన్వర్ బాష, డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధానకార్యదర్శి కేబుల్ కిరణ్, డోన్ పట్టణ టిడిపి మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అలీబాబా, టైలర్ ఇదుర్ బాష తెలుగు యువత కమిటీ సభ్యులు ఉడుములపాడు ప్రవీణ్ రెడ్డి, డోన్ పట్టణ టిడిపి పట్టణ నాయకులు ఉడుములపాడు నాగేంద్ర, డోన్ పట్టణ టిడిపి బిసి సెల్ కమిటీ ఉపాధ్యక్షులు జిలేబి ధను, హ్యూమయున్,లారీల బాష , డోన్ మండలం టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నీలం ప్రభాకర్, గల్సన్ ,డాన్ శ్రీను, కొత్తపల్లి రఫీ, తెలుగు యువత కమిటీ సభ్యులు సీసంగుంతల లక్ష్మీకాంత్,షాషా, ఖాజా, ముస్తఫా , కేబుల్ మురళీ,మెకానిక్ బాష ,బోయ మధు, బాష,బాల మద్దయ్య,హరి, పాతపేట విశ్వం తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత విఆర్ఓ దొరస్వామి రెడ్డి మృతి తీరని లోటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రికి చెందిన విశ్రాంత విఆర్ఓ దొరస్వామి రెడ్డి (80) మరణించడం తమ కుటుంబానికి తీరని లోటని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల విజేంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లవారుజామున విశ్రాంత విఆర్వో దొరస్వామి రెడ్డి ఆకస్మికంగా కన్నుమూశారు. గంగుల కుటుంబానికి అత్యంత సన్నిహితుడు కావడంతో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గంగుల నాని చాగలమర్రికి చేరుకొని దొరస్వామి రెడ్డి భౌతిక కాయంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటిం చారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల పార్టీ కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కోఆప్షన్ సభ్యులు జిగి గారి ఇబ్రహీం, ఎంపీటీసీ ఫయాజ్, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్లా బాష, మార్కెట్ యార్డు డైరెక్టర్ ముల్లా జాబిర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. విశ్రాంత విఆర్ఓ దొరస్వామి రెడ్డి మృతి పట్ల తహశీల్దార్ విజయకుమార్, మండలంలోని విఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. **టిడిపి నేతలు నివాళ్లు :** టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషా, టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, దొరయ్య మృతదేహంను సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో టిడిపి నాయకులు కొలిమి ఉసేన్‌వలి, షరీఫ్, మౌలాలి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి హనీఫ్,సల్లా నాగరాజు,కింగ్ ఉసేన్,టైలర్ ఖాదర్, రవి, బషీర్, ముల్లా గఫార్,ఆర్ గఫార్, మహబూబ్ బాష ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని బేతంచెర్ల మండలం ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీడీవో వెంగన్న అన్నారు. మంగళవారం నాడు బేతంచెర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ నాగభూషణం రెడ్డి అధ్యక్షతన గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, ఎంపీడీవో వెంగన్నలు మాట్లాడుతూ రానున్న 2023-24 సంవత్సరానికి గాను మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు ముందస్తుగా తయారు చేసుకోవాలని వారు సూచించారు.ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక వేసుకోవడం ద్వారా గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని ఆత్మకూరు ఎంపీడీవో మోహన్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు ఎంపీడీవో కార్యాలయం నందు గ్రామపంచాయతీ అభివృద్ధిపై ప్రణాళిక 2023-2024పై సర్పంచులకు, ఎంపీటీసీ, సభ్యులకు పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. **పాములపాడు :** 2023 -24 సంవత్సరాలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో కార్యాలయం నందు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో నాగ శివ లీల, తహశీల్దార్ రత్న రాధిక, ఈవోఆర్‌డి సుమిత్రమ్మ, ఆయా శాఖల అధికారులు హాజరై శిక్షణ ఇచ్చారు. **పగిడ్యాల :** 2023-24 సంవత్సరానికి గ్రామాల అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించాలని ఎంపిడిఓ వెంకటరమణ శిక్షణలో అధికారులకు సూచించారు. ప్రణాళిక రూపొందించిలన్నారు. సుస్థిరత అభివృద్ధి లక్ష్యాలను సాధించాలన్నారు. మండల,గ్రామ స్థాయిలోని అధికారులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ఈ నెల 15న శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. **రుద్రవరం :** మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఈనెల 15, 16 తేదీలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఎంజిఎంఆర్ ఈజీఎస్ అధికారులు, సచివాలయం సిబ్బంది హాజరు కావాలనికోరారు.

ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాన పెంచుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాన పెంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన వై విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరైయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతోందన్నారు. ఎంఇఒ జానకిరామ్, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులంతా విద్యార్థి దశ నుంచి సైన్స్ పట్ల పరిజ్ఞానం పెంపొందించుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలు కావాలని ఎంపీపీ కుసుమలత, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలోని జడ్పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఎంపీపీ, జడ్పిటిసి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ అల్లి బాష, ఎలిమెంటరీ స్కూల్ పాఠశాల చైర్మన్ మోహన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని తహశీల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో నాగ శివ లీల అన్నారు. జడ్పీహెచ్ హైస్కూల్ నందు మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శన ఎంఈఓ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వాటిని తహశీల్దారు, ఎంపీడీవో పరిశీలించారు. జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపికైన వారికి తహశీల్దార్, ఎంపీడీవో బహుమతులను అందజేశారు. **పగిడ్యాల :** మండల స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఇఒ సుభాన్ తెలిపారు. మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ మాట్లాడారు. ప్రథమ స్థానంలో నిలిచి విద్యార్థులు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరక్టర్ గంగిరెడ్డిగారి రమాదేవి, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి,ఉపాధ్యాక్షురాలు పల్లే అరుణామ్మ, ఎంపిడిఒ వెంకటరమణ,తహశీల్దార్ భారతి చేతుల మీదుగా ధ్రువ పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

శిక్షణలో పాల్గొన్న అధికారులు